# 3న శ్రీ అమరేశ్వర స్వామి ఆలయం మూసివేత



**అమరావతి, మార్చి1, ప్రభాతవార్త:** శ్రీ బాల చాముండిక సమేత అమరేశ్వర స్వామి దేవస్థానం మంగళవారం ఉదయం 9 గంటల నుంచి ఫాల్గొన శుద్ధ పూర్ణిమ కేతు గ్రహ సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా దేవాలయము మూసివేయనున్నట్లు సహాయ కమిషనర్ రేఖ తెలిపారు. పునః ప్రారంభం నాలుగవ తేదీ బుధవారం ఉదయం 8 గంటలకు సంప్రోక్షణ అనంతరం గుడి తెరవబడుతుందని ఆమె అన్నారు. భక్తులు గమనించగలరని తెలిపారు.

# అంగన్ వాడీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**గుంటూరు, మార్చి 1,ప్రభాతవార్త :** అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఈ మేరకు పేర్కొన్నారు. ఎన్నడూ లేని విధంగా చరిత్రలోనే తొలిసారిగా రెండు సార్లు అంగన్వాడీ వేతనాలు పెంచిన



ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు విడుదల చేసినట్లు వివరించారు. అంగన్వాడీలకు ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు అందించామన్న అందేలా చర్యలు తీసుకున్నా మని, 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్వైజర్లు, బ్లాక్ కో ఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5జి స్మార్ట్ఫోన్లు అందించామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల హాజరు 70 శాతం నుంచి 96 శాతానికి పెరిగిందని, ఏళ్ల తరబడి అంగన్వాడీలు ఎదురుచూసిన గ్రాట్యుటీ కలను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని వెల్లడించారు. దీని కోసం 2025 బడ్జెట్లోనే రూ.20 కోట్లు కేటాయించామన్నారు. అంగన్వాడీ సెంటర్ కు టీవీ, మంచి నీరు, టాయిలెట్ సౌకర్యం, టీచర్లు, ఆయాలకు వేసవిలో 15 రోజుల సెలవులు, నాణ్యమైన వంట సామగ్రి అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా అప్గ్రేడ్ చేస్తున్నామని, మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్గా పదోన్నతి కల్పిస్తున్నామని తెలిపారు. నూతనంగా 5 వేల మంది అంగన్వాడీ సహాయకులను నియమించనున్నామని వెల్లడించారు. అంగన్వాడీలు ప్రతిపాదించిన డిమాండ్లలో ఇప్పటికే తొమ్మిది నెరవేర్చామని, వేతనాల పెంపు అంశాన్ని కూడా వీలైనంత త్వరగా అమలు దిశగా కృషి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో ఆర్థిక జరిగిన ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపిస్తున్నామని, దీనికి అందరి సహకారం కావాలని పిలుపునిచ్చారు.

# గుంటూరు వార్త





# అమరావతిలో పర్యటించిన చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా

**-ఏపీ జుడీషియల్ అకాడమికి శంకుస్థాపన**
**- హైకోర్టు జడ్జీల గృహ సముదాయానికి ప్రారంభోత్సవం**
**-హాజరైన హైకోర్టు సీజే, జడ్జీలు, ముఖ్యమంత్రి**

**గుంటూరు, మార్చి1, ప్రభాతవార్తప్రతినిధి :** రాజధాని అమరావతిలోని పిచ్చుకల పాలెం వద్ద జుడీషియల్ అకాడమీ, హైకోర్టు అతిథి గృహ నిర్మాణాలకు శంకుస్థాపన అదేవిధంగా హై కోర్టు న్యాయ మూర్తుల నివాస గృహాల సముదాయాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం పాల్గొన్నారు. మొదటగా జుడీషియల్ అకాడమికి సీజేఐ శంకుస్థాపన చేశారు. ఈ జుడీషియల్ అకాడమి రూ. 165 కోట్ల వ్యయంతో నిర్మిస్తుండగా దీనిలో బి బ్లాక్లో జి ప్లస్ 3 అంతస్తులతో అకాడమిక్





బ్లాక్ నిర్మిస్తున్నారు. ఒక బ్యాచ్ లో 120 మంది ట్రైనీ జడ్జిలకు శిక్షణ ఇచ్చే సామర్థంతో నిర్మాణం చేబడుతున్నారు. తదనంతరం ఏపీ హైకోర్టు అతిథి గృహం శంకుస్థాపన కార్యక్రమంలో చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా పాల్గొన్నారు. హైకోర్టు జడ్జీల గృహ సముదాయాన్ని ప్రారంభించిన సిజేఐ. రాజధాని అమరావతిలో నిర్మించిన హైకోర్టు న్యాయ మూర్తుల నివాస గృహాల సముదాయాన్ని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సూర్య కాంత్ ప్రారంభించారు. 36 మంది న్యాయ మూర్తుల కోసం రూ.210 కోట్ల వ్యయంతో 33.20 ఎకరాల విస్తీర్ణంలో ఈ గృహాలను నిర్మించారు.



న్యాయమూర్తుల అవసరాలకు అనుగుణంగా ఆఫీసు గది, వెయిటింగ్ హాల్ తదితర వసతులతో ఈ గృహాలను ఆధునిక హంగులతో రూపొందించారు. ఈ సందర్భంగా నివాస సముదాయ ప్రారంభోత్సవ శిలా ఫలకాన్ని సిజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆవిష్కరించారు. అనంతరం జడ్జిల బంగ్లాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఎస్.వి.ఎస్. భట్టి, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు శ్యామల రావు, సురేష్ కుమార్, సి.ఆర్.డి.ఏ కమిషనర్ కన్నబాబు, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్.పి. వకుల్ జిందాల్ పాల్గొన్నారు.





# నమ్మకం నరికిన రియల్ దందా....!!

**-గుంటూరులో వెయ్యి గజాల స్థలంలో కోట్లు దోచిన స్కాం....!**
**-ఒకే ప్లాట్, ముగ్గురు బలులు....**
**-కోర్టులో వివాదం ఉన్న స్థలం...పలువురికి విక్రయాలు**
**-రియల్ స్కాంలో మహిళ మాస్టర్ మైండ్.....!**
**-రూ.కోట్ల స్కాం వెనుక లేడీకి అండగా మాజీ బ్యాంక్ మేనేజర్**
**-హైదరాబాద్ పోలీసుల వద్ద ఇప్పటికే 'కి' లేడీ అక్రమార్కుల చిట్టా**
**-గుంటూరులో కూడా పోలీసులను ఆశ్రయించేందుకు బాధితులు సమాయత్తం**
**-అగ్రిమెంట్ అయ్యాక కూడా మరో రూ.కోటి డిమాండ్**
**-ప్లాట్ మాయలో పెట్టుబడిదారుల కన్నీరు..**

**పొన్నూరు,మార్చి 1,ప్రభాతవార్త:** ఒక 'కి' లేడీ కిలాడిగా మారింది....ఆమెకు సంబంధించిన స్థలం ఆస్తిని అడ్డగోలుగా ఒకరికి కాదు...ఏకంగా ముగ్గురికి విక్రయించింది.....ముగ్గురికి అగ్రిమెంట్ చేసి తెలివిగా డబ్బులు గుంజేసింది...ఒకరి విషయం మరొకరికి తెలియకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఈ లేడీ చేసిన కిలాడి పనికి అగ్రిమెంటు రాయించుకున్న ముగ్గురు వ్యక్తులు విస్తుపోయారు. ఒకరి దగ్గర రూ.మూడు లక్షలు, మరొకరి దగ్గర రూ.ఐదు లక్షలు, ఇంకొకరి వద్ద మొత్తం రూ.61లక్షలు కొట్టేసింది. దీంతో అగ్రిమెంట్ చేయించుకున్న వ్యక్తులు ఏం చేయాలో పాలు పోక అల్లాడిపోతున్నారు. మరో విషయం ఏమిటంటే ఈ స్థలం వివాదం న్యాయస్థానంలో కూడా ఉన్నట్లు ఆమె దగ్గర అగ్రిమెంట్ చేయించుకున్న బాధితులు వాపోతున్నారు. ఇక చేసేది లేక ఈ కిలాడీ వ్యవహారాన్ని బయటకు లాగేందుకు బాధితులు స్థానిక పోలీసులను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడింది. ఒకరికి తెలియకుండా మరొకరికి అగ్రిమెంట్లు రాసి అక్రమగా డబ్బులు గుంజిన ఈమె హైదరాబాదులో ఉంటున్నట్లు సమాచారం. అంతేకాదు ఈ స్థలం అగ్రిమెంటు రాయించుకున్న ఒక వ్యక్తి మిగతా ఇద్దరితో సెటిల్మెంట్ చేసుకున్న తర్వాత....అదనంగా తనకు మరో కోటి రూపాయలు ఇస్తేనే తాను రిజిస్ట్రేషన్ చేస్తానని ఆమె అడ్డం తిరిగినట్లు ఒక బాధితుడు తన బాధను వెల్లబోసుకొంటున్నాడు. ఒక మహిళే ఇలాంటి కిలాడీ పనులు చేస్తుండటంతో పలువురు విస్తుపోతున్నారు. ఈ సంఘటన ఇటీవల గుంటూరులో జరిగింది. అంతేకాదు ఆమె తన కిలాడీ మాటలతో హైదరాబాదులో కూడా ఒకే ఫైల్లో తన చేతివాటాన్ని ప్రదర్శించినట్లు బాధితులు చెబుతున్నారు. ఈ చేతివాటంలో కొన్ని కేసుల్లో కూడా ఆమె చిక్కుకున్నట్లు తెలిసింది. బాధితులు అందరూ ఆమె అకౌంట్కి నేరుగా డబ్బులు పంపామని, ఈ ఆధారాలు పుచ్చుకొని పోలీసులను ఆశ్రయించేందుకు సమాయత్తమవ ుతున్నారు.



ఇలాంటి కీ లేడిలు చేస్తున్న కిలాడి పనులపై పోలీసులు ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గుంటూరులో కొంతమంది మహిళలు కిలాడీలుగా మారుతూ సమాజానికి తలవంపు తెస్తున్నారు. అంతే కాదు పెద్ద ఎత్తున రాజకీయ నాయకులు, విఐపిలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులను కూడా బురిడీ కొట్టిస్తున్నారు. దీంతో పలువురు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఏదోలా సెటిల్మెంట్ చేసుకునేసరికి నా ఆస్తికి ఎక్కువ రేటు ఇవ్వాలంటూ అగ్రిమెంట్ రాసుకున్న తర్వాత కూడా పేచీలు పెట్టి కొనుగోలు దారులను ముప్పతిప్పలు పెడుతున్నారు. ఈ తరుణంలో గుంటూరులో ఓ కిలాడి లేడి తంతు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈమె కొంతకాలం గుంటూరులో ఉంది. తన తమ్ముడు పేరు ఉన్న ఆస్తిని వీలునామా ద్వారా పొందింది. ఈ ఆస్తి సుమారు వెయ్యి గజాలు. ఆ స్థలం గుంటూరులోని విలువైన ప్రాంతంలో ఉంది. ఈ మహిళ హైదరాబాదుకు వెళ్ళిన క్రమంలో తనకు స ంక్రమించిన ఆస్తిని విక్రయించాలని నిర్ణయించుకొంది. వెంటనే ఆలోచించి స్థానికంగా ఉంటున్న ఒక రాజకీయ నాయకుడికి ఈ స్థలాన్ని విక్రయించి రూ.మూడు లక్షలు తీసుకొని అగ్రిమెంటు రాసింది.కాలం గడిచినా అతనికి రిజిస్టర్ చేయలేదు. అయితే ఇదే స్థలాన్ని ఆ మహిళ వక్రమార్గంలో అక్రమంగా స్థానికంగా గుంటూరులో ఉంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారికి రాజకీయ నాయకుడికి తెలియకుండా అమ్మకానికి పెట్టింది. ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారితో రూ.2కోట్లకు ఖరీదు కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆ స్థలాన్ని పరిశీలించి అగ్రిమెంట్ కుదుర్చుకున్నాడు. అయితే ఈ స్థలం అప్పటికే కోర్టు వివాదంలో ఉన్నట్లు ఆ మహిళ ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారికి చెప్పలేదు. విషయం బయటకు పొక్కకుండా తగు జాగ్రత్తలు తీసుకొంది. కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారి రూ.21లక్షలు ఆమె అకౌంట్కు పంపి అగ్రిమెంట్ వ్రాయించుకున్నారు. ఆ తరువాత ఇతను ఆ స్థలం వద్దకు వెళ్ళగానే మొదట రూ.మూడు లక్షలతో అగ్రిమెంటు చేయించుకున్న రాజకీయ నాయకుడు ఈ స్థలం నేను కొనుగోలు చేశాను....అని చెప్పడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారి బిత్తర పోవాల్సి వచ్చింది. వెంటనే ఈ వివాదంకు ఆమెను అడుగగా సరైన సమాధానం రాలేదు. అనంతరం ఈ వెయ్యి గజాల స్థలం కోర్టు వివాదంలో ఉన్నట్లు ఇరువురు తెలుసుకున్నారు. దీంతో అగ్రిమెంటు సమయంలో ఇచ్చిన డబ్బులు తిరిగి ఇచ్చేయాలని రియల్ ఎస్టేట్ వ్యాపారి కోరినా ఆ మహిళ స్పందించలేదు. దీంతో విసుగుచెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆ స్థలాన్ని బాగు చేసుకొందామని స్థలం వద్దకు వెళ్లగా తొలిసారి అగ్రిమెంట్ చేయించుకున్న రాజకీయ నాయకుడు అడ్డు తగిలాడు. ఈ వివాదం జరుగుతుండగా తాజాగా ఒక విఐపి వెలుగులోకి వచ్చి ఈ స్థలం నేను కొన్నాను...ఇదిగో రూ.ఐదు లక్షలకు అగ్రిమెంట్ నాదగ్గర ఉంది అంటూ చూపించారు. ఒక్కసారిగా రాజకీయ నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి ఖంగుతిన్నారు. ఇక అతనితో కూడా మాట్లాడి ఒకరకంగా సెటిల్మెంట్లు చేసుకున్నట్లు తెలిసింది. న్యాయస్థానంలో ఉన్న స్థలాన్ని అగ్రిమెంట్ చేయడమే ఆ మహిళ చేసిన అసలు మోసం....ఇక ఏదోలా సెటిల్ చేసుకుందా మనుకునేసరికి ఆ కిలాడి లేడి ప్లేట్ ఫిరాయించింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి రిజిస్ట్రేషన్ చేయమని అడిగిన ఆమె రావడం లేదు. తప్పించుకొని తిరుగుతోంది. అదేమంటే ఇప్పుడు స్థలం రేటు పెరిగింది...అదనంగా మరో రూ.కోటి ఇస్తేనే రిజి స్ట్రేషన్ చేస్తానని బుకాయిస్తూ అడ్డం తిరిగింది. దీంతో రూ.21లక్షల కట్టి అగ్రిమెంట్ చేయించుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి లబోదిబో మంటున్నారు. ఇక చేసేది లేక పోలీసులను ఆశ్రయించాలని బాధితులు భావిస్తున్నారు

**అక్రమాల పుట్ట.....పోలీసుల వద్ద లేడీ చిట్టా......**

రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు. విఐపిలను మోసం చేసినకిలాడి లేడీ కథలో ప్రధాన పాత్రధారిగా ఒక రిటైర్ బ్యాంకు మేనేజర్ ఉన్నట్లు సమాచారం. ఇతని వ్యవహార శైలిపై కూడా పోలీసులు కూపీలాగితే అసలు విషయాలు బయటపడతాయని బాధితులు చెబుతున్నారు. ఈ ఇద్దరు కలిసి చేసిన మోసాలు చూస్తే విస్తు గొలిపే నిజాలు కొన్ని తెలుస్తాయని అంటున్నారు. గతంలో వీళ్ళు హైదరాబాదులో మాజీ ఎంపీ కుమారుడు వద్ద రూ.10లక్షలు తీసుకొని అగ్రిమెంట్ చేసుకున్నారని, ఆ తర్వాత కాకమ్మ కథలు చెప్పి తప్పించుకు తిరుగుతున్నారనే విమర్శలున్నాయి. ఈ వ్యవహారంలో గుంటూరుకు చెందిన ఒక మాజీ ఎమ్మెల్యే పిఏ రూ.ఐదు లక్షలకు సెటిల్మెంట్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ తరువాత ఒక ప్రముఖ టీవీ చానల్ అధినేత తమ్ముడి దగ్గర నుంచి కూడా రూ.20లక్షలు అకౌంట్లో వేయించుకొని అతనిని కూడా బోల్తాకొట్టించారట. అంతేకాకుండా ఒంగోలు రియల్ ఎస్టేట్ వ్యాపారి దగ్గర నుండి కిలాడి రేడీ తమ్ముడు రూ.10లక్షలు అప్పనంగా దండుకున్నట్లు చెప్పారు. అలాగే గుంటూరు బిల్డర్, రియల్ ఎస్టేట్ వ్యాపరి దగ్గర స్థలం రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పి ఆ మహిళ మరో రూ.40లక్షలు గుంజినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఆ మహిళ, ఆమె తమ్ముడు, మాజీ బ్యాంకు మేనేజర్ విక్రయించిన స్థలానికి సంబంధించి మరికొంతమంది వారసులు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ మహిళ చేస్తున్న అక్రమాలను తెలుసుకున్న అసలైన స్థల యాజమాన్యం వచ్చి గుంటూరులో ఆమె చేతిలో మోసపోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారిని కలిసి అన్నీ వివరాలు తెలుసుకున్నారు. అంతేకాదు ఈ కిలాడి లేడీ హైదరాబాదులో ఉన్న తన సమీప బంధువులను కూడా దారుణంగా చీట్ చేసినట్లు సమాచారం. దీంతో బ్యాంకు మేనేజర్ కిలాడి మహిళ హైదరాబాదులో కొన్ని కేసుల్లో ఇరుక్కున్నట్లు తెలుస్తోంది. ఈ మహిళ మోసాలను గుర్తించి ఆమె బంధువులు కూడా రియల్ ఎస్టేట్ వ్యాపరులతో కలిసి గుంటూరులో పోలీసులను ఆశ్రయించేందుకు సమాయత్తమవుతున్నారు. పోలీసుల చొరవతో ఈ 'కీ'లేడి వ్యవహారం ఏ విధంగా మారుతోందో వేచి చూద్దాం...

# రైలు ఢీకొని వ్యక్తి మృతి

**తెనాలి టౌన్ ,మార్చి1,(ప్రభాతవార్త):** రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని పినపాడు రైల్వే గేటు వద్ద ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం పట్టణంలోని పినపాడు ప్రాంతానికి చెందిన కరేటి సురేష్(53) అనే వ్యక్తి ఉదయం 6 గంటల సమయంలో టిఫిన్ కోసం వస్తు పినపాడు రైల్వే గేట్ సమీపంలో పట్టాలు దాటుతుండగా, బెంగుళూరు నుండి హౌరా వెళ్తున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ ఢీ కొట్టడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మరణించాడు. ఒకేసారి రెండు రైళ్లు రావటంతో గందరగోళానికి గురైన సురేష్ ను ఒకటో నెంబర్ ప్లాట్ఫారం పైకి వస్తున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ ట్రైన్ బలంగా ఢీకొట్టింది.మృతునికి భార్య, కుమార్తె,కుమారుడు ఉన్నారు.ఇంటికి పెద్దదిక్కు రైలు ప్రమాదంలో మరణించడంతో ఆ కుటుంబంలో తీవ్రవిషాదం నెలకొంది.విజయవాడచెన్నై మెయిన్ రైల్వేలైన్ లో మద్రాసు గేటుగా పిలవబడే, పినపాడు రైల్వే గేటు వద్ద తరచూప్రమాదాలు జరుగుతున్నాయని, గత శనివారం కూడా గుర్తు తెలియని వ్యక్తి ఇదే ప్రాంతంలో రైలు ఢీకొని మరణించాడని, వీటిని నియంత్రిం చడానికి ప్రజల్లో అవగాహన కల్పించాలని స్థానికులు కోరు తున్నారు.



ప్రధానంగా పినపాడు, పాండురంగపేట, చెంచుపేట ప్రాంతాల నుండి ప్రజలు పట్టణంలోకి ఇదే మార్గంలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని,ప్రతిరోజు వందలాది రైళ్లు ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఉంటాయని, ప్రతి పది నిమిషాలకు కొకసారి ఇక్కడ రైల్వే గేట్ పడుతుందని, ఒక్కొక్కసారి రెండు మూడు ట్రైన్లు కూడా ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఉంటాయి కాబట్టి ఈ ప్రాంతంలో రైల్వే శాఖ వారు, నిరంతరం ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు. మృతుడి సమాచారం అందుకున్న రైల్వే జి ఆర్ పి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళలు ధైర్యంగా ముందుకు రావాలి

## -ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు క్రైమ్, మార్చి1,ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరు నగరంలో ఆదివారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ లో ర్యాలీ నిర్వహించారు. మహిళల భద్రత, గౌరవం, సాధికారతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గుంటూరు ఈస్ట్ డిఎస్పి ఎస్.కె అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభమైంది.వెంకటేశ్వ విజ్ఞాన మందిరం నుండి ఆర్.కె.టి సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాలను అరికట్టడంలో



పోలీస్ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు.˘మహిళలు అందరూ ధైర్యంగా ముందుకు రావాలనీ ఏదైనా ఇబ్బంది కలిగినప్పుడు డైల్ 112 కి గాని శక్తి టీమ్ ను కానీ వినియోగించుకోవాలని లేదా నేరుగా పోలీస్ స్టేషన్లో రిపోర్ట్ ఇవ్వ వచ్చని,రక్షక్ వాహనం 24 గం లు సేవలు అందిస్తుందని తెలియజేశారు.సమాజంలో మహిళలకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, కుటుంబ స్థాయి నుంచే బాలికలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలన్నారు. యువతలో లింగ సమానత్వంపై చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళా పోలీస్ సిబ్బందితో పాటు వార్డు మహిళా పోలీసులు,విద్యార్థినులు ర్యాలీలో పాల్గొని మహిళా రక్షణ, చట్టపరమైన అవగాహన, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాలపై ప్రజలకు సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎస్.ఐ డి.రమేష్,పి.సుబ్బరావు,లాలాపేట ఎస్.ఐ వెంకట్రావు,పాతగుంటూరు ఎస్.ఐ రెహమాన్,ట్రాఫిక్ సిబ్బంది,గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది,పాఠశాలల విద్యార్థునులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల అసోసియేషన్ అధ్యక్షునిగా చుక్కపల్లి రమేష్

**గుంటూరులీగల్, మార్చి 1, ప్రభాతవార్త:** టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరు జిల్లా ప్రధాన న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ చుక్కపల్లి రమేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఏలూరు బార్ అసోసియేషన్ లో జరిగిన ఆంధ్రప్రదేశ్ టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశంలో అసోసియేషన్ కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా నరసరావుపేట అదనపు జిల్లా కోర్ట్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వి.ఎస్.ప్రసాద్, గౌరవ అధ్యక్షుడుగా తాడేపల్లిగూడెం అడిషనల్ పబ్లిక్ ప్రాసెక్యూటర్ కుసులూరి శివరామకృష్ణ, ట్రెజరర్గా ఏలూరులో ఏపీపీగా పనిచేస్తున్న ఐ రాజశేఖర్, లేడీ ఎగ్జిక్యూటివ్ గా విజయవాడ పోక్సో కోర్టు స్పెషల్ పిపి సిహెచ్ గీతా పూర్ణిమ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల పర్యవేక్షకులుగా ఏలూరు జిల్లా కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ వి నారాయణ, మాజీ అధ్యక్షుడు అబ్బినేని విజయ్, గుంటూరు పోక్సో కోర్ట్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తీగల దుర్గా ప్రసాద్ లు వ్యవహరించారు.



# 22న శ్రీవామన చరిత్రపై ప్రవచనం

**పొన్నూరు, మార్చి 1,ప్రభాతవార్త:** పట్టణంలోని బ్రాహ్మణ బజారులో వేంచేసియున్న శ్రీ గాయత్రీ మందిరం-శంకరమఠంలో ఈ నెల 22వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు శ్రీ వామన చరిత్ర అనే అంశంపై ప్రవచనం నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ మహాసభ అధ్యక్ష, కార్యదర్శులు గణపవరపు రామశాస్త్రి, ఎఆర్కెఎస్టీ సాయి తెలిపారు. బాపట్ల జిల్లా చీరాలకు చెందిన పావులూరి బలరామకృష్ణచే ఈ ప్రవచన కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతిమాసం వాణీ దరహాసం సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రవచనంలో సాహిత్యాభిమానులు, తెలుగు భాషాభిమానులు, భక్త మహాశయులు, కళాకారులు, కళాపోషకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటిద్దాం... .కార్యక్రమాన్ని సజావుగా సాగేవిధంగా కృషి చేద్దామన్నారు.

# భద్రతా ఏర్పాట్లు పరిశీలన

**గుంటూరు క్రైమ్,మార్చి1,ప్రభాతవార్త:**తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని దొండపాడు శివారులో పిచ్చుకులపాలెం వద్ద జరగనున్న ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించి ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠీ,గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్రంగా పరిశీలించారు.ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు ప్రధాన



న్యాయమూర్తి,ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి,ఇతర ఉన్నత న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు,ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు అత్యంత పటిష్టంగా చేయబడినట్లు అధికారులకు ఆదేశాలు జారీచేశారు.శంకుస్థాపన వేదిక,వీఐపీ ప్రవేశ మార్గాలు, పార్కింగ్ స్థలాలు,సాధారణ ప్రజల రాకపోకల మార్గాలు,ట్రాఫిక్ మళ్లింపు పాయింట్లు మొదలైన అంశాలను సమగ్రంగా పరిశీలన చేశారు.వీఐపీ భద్రత, యాక్సెస్ కంట్రోల్, బ్యారికేడ్లు, చెక్ పోస్టుల ఏర్పాటు విధానంపై సూచనలు ఇచ్చారు.ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక రూట్ మ్యాపింగ్, పార్కింగ్ ప్లానింగ్, అత్యవసర సేవల కోసం ప్రత్యేక మార్గాల కేటాయింపుపై దిశానిర్దేశం చేశారు.శంకుస్థాపన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ను సందర్శించి,సీసీ కెమెరాల పనితీరు,మానిటరింగ్ వ్యవస్థను పరిశీలించారు.డ్రోన్ కెమెరాల ద్వారా



విస్తృత గస్తీ నిర్వహించి, ప్రతి మూలను నిఘాలో ఉంచాలని ఆదేశాలు జారీచేశారు.బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులకు నిరంతర సమన్వయం, వైర్లెస్ కమ్యూనికేషన్ సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదనంగా, అగ్ని ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితుల సందర్భంలో తక్షణ చర్యల కోసం ఫైర్ సర్వీసెస్, మెడికల్ టీమ్స్, అంబులెన్స్ సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు.తదనంతరం ఎస్పీ నేలపాడులోని న్యాయమూర్తుల క్వార్టర్స్ను సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఐజీ,ఎస్పీ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం రాష్ట్రానికి గౌరవప్రదమైనది కావున భద్రతా ప్రమాణాల్లో ఎటువంటి లోపం లేకుండా అత్యంత క్రమశిక్షణతో బందోబస్తు నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్శనలో జిల్లా అదనపు ఎస్పీలు ఎటీవీ రవికుమార్, (లి వీ), కే. సుప్రజ,(క్రైమ్స్ ),ఏ. హనుమంతు (ఏఆర్), తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ,ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరావు,ఎస్బీ సీఐలు అలహరి శ్రీనివాస్,తుళ్లూరు సీఐ శ్రీనివాసరావు,ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## ఘనంగా 'భాష్యం' రామకృష్ణ పుట్టినరోజు వేడుకలు



సత్తెనపల్లి, మార్చి 1, ప్రభాతవార్త: భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుంటూరులో జరిగిన కార్యక్రమంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తదితరులు హాజరైన భాష్యం రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఇందూరి శ్రీనివాస్ రెడ్డికి 'గజ్జల' ఘన నివాళి



ముప్పాళ్ళ, మార్చి 1, ప్రభాతవార్త: ముప్పాళ్ళ మండలం రుద్రవరం గ్రామంలో ఇందూరి శ్రీనివాస్ రెడ్డి గారి దశదిన కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తల్లిదండ్రులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి రాజ సులోచన , నాయకులు గుణం పెద్దిరెడ్డి, గుణం కృష్ణ రెడ్డి , మేరుగ పున్నారెడ్డి ,వనమాల బ్రహ్మారెడ్డి , రావ్రోలు అంజి రెడ్డి, అన్నపరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , ధోగిపర్తి శివకేశవ, ఇసిరెడ్డి శివకోటిరెడ్డి , అన్నపరెడ్డి సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'వేట్లపాలెం బాణసంచా కేంద్రంలో ప్రమాదం బాధాకరం'

సత్తెనపల్లి, మార్చి 1, ప్రభాతవార్త: సామర్లకోట మండలం వేట్లపాలెం బాణసంచా కేంద్రంలో ప్రమాదం బాధాకరమని మృతుల కుటుంబానికి రూ.50 లక్షలు తీవ్ర గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించి రూ.10 లక్షలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో ఇటీవల జరిగిన సంఘటన మరువకముందే వేట్లపాలెంలో మరో దుర్ఘటన జరగటం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. బాణసంచా కేంద్రాల్లో కార్మిక చట్టాలు అమలు, భద్రత చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలం అవటంతో ఇటువంటి సంఘటనలు తరచుగా చోటు చేసుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగినప్పుడు ప్రభుత్వాలు, అధికారులు హడావుడి చేసేన తర్వాత మరళా షరా మామూలుగా వదిలేయడంతో ప్రమాదాలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి పేర్కొన్నారు. ప్రమాదంపై నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు.



## వివాహ వేడుకలకు హాజరైన డాక్టర్ గజ్జల'



సత్తెనపల్లి, మార్చి 1, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని వెంకటేశ్వర గ్రాండ్ ఏసీ ఫంక్షన్ హాల్ నందు రాజుపాలెం మండలం బలిజేపల్లి గ్రామానికి చెందిన గంగదాసు పెద్దలక్ష్మీరెడ్డి రోజా రమణి కుమారుడు వెంకట రామ శివతేజ రెడ్డి వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి తల్లిదండ్రులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి రాజ సులోచన తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం









సత్తెనపల్లి, మార్చి 1, ప్రభాతవార్త: అంతర్జాతీయ మహిళా దినోత్సవం లో భాగంగా ఆదివారం సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ నందు సుమారు 250 మంది విద్యార్థులతో సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి వైఫ్ అడుగుల ర్యాంప్ వరకు వెళ్లి తిరిగి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా రావడం జరిగింది. ఇందులో దిదిశ్ని శ్రీలత,చైల్డ్ వెల్ఫేర్ మేడమ్ , సత్తెనపల్లి టౌన్ లు,మహిళా పోలీస్ లు, సిబ్బంది పాల్గొనడం జరిగింది.

సత్తెనపల్లి, మార్చి 1, ప్రభాతవార్త: "అంతర్జాతీయ మహిళా దినోత్సవం" సెలబ్రేషన్స్ లో భాగంగా సత్తెనపల్లె టౌన్ సిఐ నరహరి నాగమల్లేశ్వరావు ఆధ్వర్యంలో మహిళామణులు తో సత్తెనపల్లి టౌన్ పోలిసు స్టేషన్ వద్ద నుండి తాలూకా సెంటర్, గడియార స్తంభం, ఐదు లాంతర్ల సెంటర్ వరకు ర్యాలి నిర్వహించటం జరిగింది. ఈ ర్యాలీ లో సుమారు 300 మంది అనగా మహిళలు, మహిళా పోలీస్‌లు విద్యార్థినులు, అంగన్వాడి ఆషా వర్కర్ లు మొదలైన వారు పాల్గొనారు. మహిళా సాధికారత మరియు భద్రత పై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించటం జరిగింది.

సత్తెనపల్లి టౌన్ పోలీస్ ఆధ్వర్యంలో "అంతర్జాతీయ మహిళా దినోత్సవం" సందర్భంగా .. సెలబ్రేషన్స్ లో భాగంగా మహిళలకు ఇండోర్ గేమ్స్ ప్రోగ్రాం నిర్వహించారు. సత్తెనపల్లి టౌన్ లోని కాకతీయ కళ్యాణ మండపం లో సత్తెనపల్లి టౌన్ ఖ్సు నరహరి.నాగమల్లేశ్వరావు ఆధ్వర్యంలో మహిళామణుల కి ఇండోర్ గేమ్స్ నిర్వహించినార.. ముఖ్య అతిథులుగా సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి గౌరవ డాక్టర్.సుజాత (చైల్డ్ దెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్) శ్రీలత కృష్ణవేణి జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ శ్రీనివాసరావు దంపతులు గార్ల్స్ హాస్టల్ వార్డెన్ (నాగన్నకుంట) సుమని సత్తనపల్లి పట్టణ ఎస్సైలు ఎం పవన్ కుమార్ మరియు రాజశేఖర్ గారు సిబంది పాల్గొన్నారు. సుమారు 250 మంది మహిళా మణులు అనగా విద్యార్థినులు, అంగన్వాడీ టీచర్లు, మహిళా పోలీసులు, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ వారు, అంగన్వాడీలు, ఆషా వర్కర్లు మొదలైన మహిళలు పాల్గొన్నారు. మహిళల ఇండోర్ క్రీడలో భాగంగా చెస్, క్యారమ్స్, హ్యాండ్ రింగ్ వంటి క్రీడలు నిర్వహించారు

## నేడు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

సత్తెనపల్లి, మార్చి 1, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం కంటేపూడి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 12:00గంటలకు MPES స్కూల్ ఆవరణలో రీ సర్వే పూర్తి కాబడిన గ్రామములలో ప్రభుత్వ రాజముద్ర తో కూడిన పట్టాదారు పాసుపుస్తకముల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడును, సదరు కార్యక్రమంనకు స్థానిక శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణపాల్గొనేదరు, కావున రైతు సోదరులందరూ ఈ కార్యక్రమమునకు హాజరయ్యి పట్టాదారు పాస్ పుస్తకములు పొందవలసినదిగా అధికారులు విజ్ఞప్తి చేశారు.

## 'ఉత్తిత్తి ప్రకటనలతో కాలం గడపటం సరికాదు'

సత్తెనపల్లి, మార్చి 1, ప్రభాతవార్త: ఉత్తిత్తి ప్రకటనలతో కాలం గడపటం సరికాదని గత ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అమలు చేయాలని పలనాడు భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు కోట




ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 16వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో పల్నాడు జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక గార్లపాడు బస్టాండ్ సెంటర్లో ఆయన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘం గౌరవ అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం సంక్షేమ బోర్డు నిధులను ఇతర పథకాలకు మళ్లించి భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కార్మికులను మోసం చేసిందని తాము అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను అమలు చేసి తీరుతామని ఓటమి ప్రభుత్వం గత ఎన్నికల ముందు కార్మికులకు హామీ ఇచ్చిందని అన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా నేటికీ సంక్షేమ పథకాలు అమలు చేయలేదని పత్రిక ప్రకటనలతో ఉత్తిత్తి మాటలతో కాలం గడుపుతున్నారని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈనెల 16వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద సంఘం ధర్నాకు పిలుపివ్వడం జరిగిందని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం భవనిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నెల 16వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో పల్నాడు జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కరపత్రం ఆవిష్కరణలో సంఘం పట్టణ కార్యదర్శి గొట్టిపాటి సాల్మన్ రాజు, పుట్టా నరసింహారావు, స్వామి, గోవిందు, గుండెబోయిన చంద్రయ్య, పెదాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నేడు మాచర్లలో ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి పర్యటన

మాచర్ల, మార్చి 1 ప్రభాతవార్త: మాచర్లలోని 8, 9, 10, 11 వార్డుల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సుడిగాలి పర్యటన చేయనున్నారు. ఆయా వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైన్లను ఆయన పరిశీలించి, పనులపై సమీక్షిస్తారని ఎమ్మెల్యే కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది.



## ఎంపీడీఓ తీరుపై అసహనం

మాచర్ల, మార్చి 1 ప్రభాతవార్త: విధి నిర్వహణలో ఉండి చెయ్యి విరిగినా, కనీసం మానవతా దృక్పథం లేకుండా సెలవు నిరాకరిస్తున్న మాచర్ల ఎంపీడీఓ తీరుపై పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైవీడీ ప్రసాద్ తీవ్రంగా మండిపడ్డారు. చెయ్యి విరిగి బాధపడుతున్న చింతలతండా పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణను ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ప్రసాద్ ఎంపీడీఓ వైఖరిని ఎండగట్టారు. ప్రభుత్వ విధులను బాధ్యతతో నిర్వహిస్తున్న వ్యక్తి గాయపడితే సెలవు ఇవ్వకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఎంపీడీఓ తన మొండి వైఖరిని వీడాలని, బాధిత కార్యదర్శికి తక్షణమే సెలవు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్యదర్శులందరితో కలిసి తదుపరి కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.



## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: ఇన్‌ఛార్జి డీఎస్పీ వెంకటరమణ

మాచర్ల, మార్చి 1 ప్రభాతవార్త: మహిళలు అన్ని రంగాల్లో రాణించి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని గురజాల ఇన్‌ఛార్జి డీఎస్పీ వెంకటరమణ అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాలు స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం జరిగాయి. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరమణ మహిళలను, విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, కష్టపడి చదివి జీవితంలో ఉన్నతమైన స్థానంలో ఉండి, తమ కుటుంబం పట్ల, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టి.వెంకటరమణ, రూరల్ సీఐ నఫీజ్‌బాషా, ఎస్సైలు సంధ్యారాణి, వెంకట్రావు, రమేష్, పాఠశాల టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.



## పేదల ప్రాణాలకు సంజీవని సీఎం సహాయనిధి

కారంపూడి, మార్చి 1 ప్రభాతవార్త: పేదల ప్రాణాలకు సంజీవని సీఎం సహాయనిధి అని మండల టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని కారంపూడి, ఒప్పిచర్ల, కాకానివారిపాలెం, ఇనుపరాజుపల్లి గ్రామాలకు చెందిన ఎనిమిది మందికి ఆదివారం వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎనిమిది లక్షల 11 వేల రూపాయల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. అలాగే టీడీపీ కార్యకర్త అద్దంకి వెంకట్రామయ్య కుటుంబానికి రూ.5 లక్షల చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ కష్టకాలంలో ఆర్థికంగా సహకరించి మేలు చేసిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు గోళ్ల సురేష్‌యాదవ్, తండా మస్తాన్‌జానీ, కటికల బాలకృష్ణ, ఉన్నం లక్ష్మీనారాయణ, బాలునాయక్, కిలారి పవన్, పంగులూరి లక్ష్మయ్య, ఎస్పీఆర్ కృష్ణ, బోల్నేడి హరికృష్ణ, కోదాటి సీతయ్య తదితరులు పాల్గొన్నారు.



## దాడి కేసులో ఏడుగురు నిందితుల అరెస్ట్

గురజాల, మార్చి 1 ప్రభాతవార్త : మండలంలోని తేలుకుట్ల గ్రామ టీడీపీ సీనియర్ నేత బత్తుల ఏడుకొండలుపై దాడి కేసులో ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ భాస్కర్ తెలిపారు. నిందితులైన చల్లా గురుదేవరాజు, ప్రేమ్‌కుమార్, బత్తుల శ్రీనివాసరావు, చల్లా ఆంజనేయులు, మొగిలి కోటేశ్వరరావు, చల్లా మణికంఠ, వేముల కిషోర్‌లను అరెస్ట్ చేసి ఆదివారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరుచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ భాస్కర్ చెప్పారు.



## అన్ని వర్గాలకు అండగా కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, మార్చి 1 ప్రభాతవార్త: అన్ని వర్గాలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో 53 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నగదు చెక్కులను ఎమ్మెల్యే జూలకంటి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆపదలో ఉన్న ఎందరో అభాగ్యులకు సహాయనిధి ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదుకుంటున్నారని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా అందుతున్న సంక్షేమం, జరుగుతున్న అభివృద్ధి చూసి జగన్‌రెడ్డి జీర్ణించుకోలేక కూటమి పార్టీలపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్యే

వెల్దుర్తి, మార్చి 1 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలపై ఎమ్మెల్యే జూలకంటి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు స్పందించకుంటేనే ప్రజలు ఎమ్మెల్యే వద్దకు వచ్చి సమస్యలు చెప్పుకుంటారన్నారు. సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమని సూచించారు. ఈ ప్రజాదర్బార్‌లో దాదాపు 25 అర్జీలు వివిధ సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేకు అర్జీల రూపంలో అందించగా, వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 'పిన్నెల్లి' సోదరుల విడుదల కోరుతూ పాదయాత్ర

విజయపురిసౌత్, మార్చి 1 ప్రభాతవార్త: పిన్నెల్లి సోదరుల విడుదల కోసం మాచర్ల మండలం జమ్మలమడక నుంచి విజయపురిసౌత్ సాగరమాత మందిరం వరకు20 మంది వైసీపీ కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించారు. సాగరమాత మందిరం చేరుకుని ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానిక వైసీపీ నాయకులు తంగిరాల రామిరెడ్డి, కార్యకర్తలనుకలిసి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలకు త్వరలో బెయిల్ మంజూరు అయి విడుదల అవ్వాలని కోరుతూ జమ్మలమడక నుంచి సాగరమాత మందిరం వరకు పాదయాత్ర చేపట్టా మని తెలిపారు. వీరిని స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి సంఘీభావం తెలిపారు.



## ఈపూరు తిరునాళ్ళ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే 'బొల్లా'



ఈపూరు, మార్చి1, ప్రభాతవార్త: మండలకేంద్రం ఈపూరు గ్రామంలోని శ్రీ బోటిమీద ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల ఆదివారం ఘనంగా జరిగింది. వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని పంటలు బాగా పండి రైతులు ఆనందంగా ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో వైకాపా నియోజకవర్గ స్థాయి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారిణి ముక్కపాటి లిఖితకు చీఫ్‌విప్ జీ.వీ ప్రశంస

### రూ. 25వేలు ఆర్థిక సాయం అందజేత

వినుకొండ, మార్చి1, ప్రభాతవార్త: ఇండోనేషియాలో ఈనెల 14 నుంచి 19 వరకు జరిగిన బాల్ బ్యాడ్మింటిన్ టెస్ట్ సిరీస్‌లో గెలుపొందిన ఇండియా జట్టులో శావల్యాపురం మండలం కనమర్లపూడి గ్రామానికి చెందిన ముక్కపాటి లిఖిత అత్యుత్తమ ప్రదర్శన చేసి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించింది. స్వదేశానికి చేరుకున్న ఆమెను ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు నివాసంలో కలుసుకొని అభినందించారు. లిఖిత భవిష్యత్తులో మరింతగా రాణించి జాతీయస్థాయిలో పేరు ప్రతిష్టలు తీసుకురావాలని జీ.వీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రూ.25వేల ఆర్థిక సాయం క్రీడాకారుని లిఖితకు జీవీ ఆంజనేయులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## అవినీతి,అక్రమాల కేసుల్లో 'బొల్లా' జైలుకు వెళ్లడం ఖాయం

### చీఫ్‌విప్ జీ.వీ, డీసీసీబీ చైర్మన్ 'మక్కెన'

వినుకొండ, మార్చి1, ప్రభాతవార్త: ఐదేళ్ల వైసిపి పాలనలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని బొల్లా బ్రహ్మనాయుడు చేసిన భూ ఆక్రమణలు,దందాల వివాద కేసుల్లో బొల్లా జైలుకు వెళ్లడం ఖాయమని ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జీ.వీ మాట్లాడారు. బొల్లా బ్రహ్మనాయుడు ఐదేళ్ల వైసిపి పాలనలో ఎమ్మెల్యే అధికారం అడ్డం పెట్టుకొని ప్రభుత్వ భూమిలే కాకుండా దౌర్జన్యంగా ప్రైవేటు భూముల్ని కూడా ఆక్రమించారన్నారు. భూ దందాలకు పాల్పడిన బొల్లా దొంగే.. దొంగ.. దొంగ అన్న చందంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారాన్ని అడ్డం పెట్టుకున్న బ్రహ్మనాయుడు వినుకొండ కొండ చుట్టూ దౌర్జన్యంగా కారు చౌకగా భూములు కాజేసి చుట్టూ రోడ్లు వేసుకునేందుకు



రామలింగేశ్వరస్వామి కలలోకి వచ్చాడని గిరి ప్రదర్శన రోడ్డు వేస్తానని ప్రజాధనంతో తన భూముల వరకు రోడ్లు వేయించుకొని ప్రజలను మోసం చేశారన్నారు. కారంపూడి రోడ్డు చెక్కవాగు వద్ద 4 ఎకరాలు భూమిని కొన్న బొల్లా దళిత క్రిస్టియన్‌కు చెందిన జోసెఫ్ ఫ్రెడ్రిక్ 2 ఎకరాల భూమిని ఆక్రమించాడని,కొండ వద్ద ఒక బీసీ పేద కుటుంబానికి చెందిన కనమల నాసరయ్య భూమిని అక్రమంగా కాజేచేశారని,వెంకట్రావు,హనుమంతరావులకు చెందిన ప్రైవేటు ఆస్తులను దౌర్జన్యంగా బ్రహ్మనాయుడు ఆక్రమిస్తే బాధితుల కోర్టును ఆశ్రయించడం జరిగిందని చెప్పారు. ఇలా ఎన్నో ప్రభుత్వ,ప్రైవేటు భూములను ఆక్రమించిన బొల్లా బ్రహ్మనాయుడుపై కోర్టులో కేసులు నడుస్తున్నాయని,భూ వివాదాల కేసుల్లో బ్రహ్మనాయుడు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. గంజాయి,గుట్కా,మట్కా,మట్టి,ఇసుక ఇలా అవినీతి అక్రమాలను నియోజకవర్గం వైసీపీ నాయకులకు మండలాల వారీగా పంచి నాడు బీ టాక్స్ వసూలు చేసి వందల కోట్లు దోపిడికి పాల్పడ్డారని ఆరోపించారు. అవినీతి,అక్రమాలు భూ దందాలు చేసిన బొల్లాకు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడును విమర్శించే స్థాయి ఉందా అని ప్రశ్నించారు. నాడు టిడిపి పాలనలో తాము శాశ్వతంగా త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు 160 కోట్లు తెచ్చామని,500 కోట్లు విలువచేసే ఎన్ఎస్‌పి స్థలాన్ని మున్సిపాలిటీకి బదలాయిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు క్యాబినెట్ ఆమోదంతో 146 జీవో ఇవ్వటం జరిగిందని తెలిపారు. తనహయాంలోనే ఘాట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని ప్రజల భాగస్వామ్యంతో రామలింగేశ్వరస్వామి దేవాలయానికి శ్రీకారం చుట్టింది తమ ప్రభుత్వమే అన్నారు. తాము అభివృద్ధికి శంకుస్థాపనలు చేస్తే అవన్నీ బొల్లా చేసినట్లుగా అసత్య ప్రచారాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. పల్నాడు జిల్లా సమగ్ర అభివృద్ధికి మార్చి ఏడో తేదీన జిల్లా ఎమ్మెల్యేలు,అధికారులతో సీఎం చంద్రబాబు నాయుడుని కలవనున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్ది,ప్రతి రైతుకు లక్ష రూపాయలు ఆదాయం పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి ధ్యేయంగా శ్రమిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

**బొల్లాకు మతిభ్రమించింది: మక్కెన**

వినుకొండ నియోజకవర్గంలో సొసైటీ చెరువులు ఎన్ని ఉన్నాయో కూడా తెలియని బొల్లా బ్రహ్మనాయుడు మతిభ్రమించి మాట్లాడుతున్నారని జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు విమర్శించారు. వేల్పూరు సొసైటీ చెరువును వైకాపా ఎంపీపీ అనిల్ కుమార్,ఈపూరు సొసైటీ చెరువును వైసిపి నాయకుడు బుచ్చయ్య చౌదరి,కనుమల్లపూడి చెరువు వైసీపీ జడ్పిటిసి చౌడయ్య చేస్తున్నారని,పెద్దకంచెర్ల చెరువు ఒక్కటే సొసైటీ చెరువు కాదన్నారు. బ్రహ్మనాయుడు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని మండిపడ్డారు. వ్యక్తిగత విమర్శలు చేస్తున్న బొల్లా బ్రహ్మనాయుడు ఒక పాల వ్యాపారిగా వందల కోట్లు ఎలా సంపాదించారో ప్రజలకు చెప్పాలన్నారు. కల్తీ పాలు,అవినీతి,అక్రమాలు,దందాలు చేసి కోట్లకు పడగలెత్తిన బొల్లాకు రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడును,వినుకొండ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులును విమర్శించే స్థాయి లేదన్నారు. వ్యక్తిగత స్వార్థం కోసం అధికారం అడ్డం పెట్టుకొని నాడు బ్రహ్మనాయుడు కోల్డ్ స్టోరేజీని వేల్పూర్ లో నిర్మించి రైతులకు అన్యాయం చేశారన్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని అడిగిన రైతుపై చెప్పుతో దాడి చేసి హత్యాయత్నం కేసు పెట్టిన దుర్మార్గుడని అన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి పేదల పాలిటి పెన్నిధి: ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ, మార్చి1, ప్రభాతవార్త: సీఎం సహాయనిది పేదల పాలిటి పెన్నిదని ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 76 మంది లబ్ధిదారులకు రూ. 42 లక్షల 38 వేలు చెక్కులను ఆదివారం తన కార్యాలయంలో చీఫ్‌విప్ జీ.వీ పంపిణీ చేశారు. వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు నాయుడు అందించిన నిధులు తమకు అందేలా కృషిచేసిన ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీకి ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



## శివశక్తి ఉచిత కంటి వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: జీ.వీ

వినుకొండ, మార్చి1, ప్రభాతవార్త: శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో గంగినేని ఫంక్షన్‌హాల్ నందు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫౌండేషన్ స్థాపకులు,చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు పాల్గొని ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన కంటి వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఉచిత కంటి వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శిబిరాల్లో పాల్గొన్న ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించి,మందులు,కళ్ళజోళ్ళు పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో శంకర కంటి హాస్పిటల్ వైద్యులు,డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు,పలువురు నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



## ఈపూరు శ్రీ బోటి మీద ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ళలో పాల్గొన్న చీఫ్‌విప్ జీ.వీ

ఈపూరు, మార్చి1, ప్రభాతవార్త: ఈపూరు గ్రామంలోని శ్రీ బోటి మీద ప్రసన్నాంజనేయస్వామి తిరు నాళ్ళ సందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు స్వామివారిని దర్శించు కున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# బాపట్ల జిల్లా వార్త



## మందుగుండు సామాగ్రి ఎవరూ నిల్వ చేయరాదు



**నిజాంపట్నం, మార్చి 1, ప్రభాతవార్త:** పేలుడు పదార్ధాలైన మందుగుండు సామాగ్రి ఎవరూ నిల్వచేయరాదని నిజాంపట్నం ఎస్ఐ తిరుపతిరావు అన్నారు. దీపావళి మందుగుండు సామాగ్రి వి క్రయాలకు తాత్కాలిక అనుమతి తీసుకున్న కొందరి నివాస ప్రాంతాలను, గోదాములను ఆయన తన సిబ్బందితో తనిఖీ నిర్వహించారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా దీపావళి మందుగుండు సామాగ్రిని ఎవరూ నిల్వ ఉంచరాదన్నారు. గత సంవత్సరం దీపావళి పండుగకు తీసుకువచ్చిన సామాగ్రి ఎవరి వద్దనైనా నిల్వ ఉంటే వాటిని సమీపంలోని ప్రభుత్వ అనుమతులు పొందిన గోదాముల వద్ద అప్పగించాలన్నారు. పేలుడు పదార్థాలు కలిగి ఉంటే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వేమూరులో ఎమ్మార్పీఎస్ అమరవీరులకు నివాళులు



**వేమూరు మార్చి 1,(ప్రభాతవార్త) :** మాదిగ రిజర్వేషన్ వర్గీకరణ కోసం పోరాటంలో అమరులైన వారికి ఎమ్మార్పీఎస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక బాబ జగ్జీవన్‌రావు విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరవీరులను స్మరించుకుంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ డివిజనల్ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ బాపట్ల జిల్లా వైస్ ప్రెసిడెంట్ కిషోర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దేవరాజ్, కటికల శేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : ఎమ్మెల్యే వేగేశన



**బాపట్ల, మార్చి 1: ప్రభాతవార్త:** అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిరు ఉద్యోగుల సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వం అత్యంత సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తోందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు స్పష్టం చేశారు. విజయవాడలో అంగన్వాడీలు చేపట్టబోయే ధర్నా నేపథ్యంలో ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ, అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు గత ప్రభుత్వ హయాంలో వేతనాల కోసం అంగన్వాడీలు పడ్డ ఇబ్బందులకు తాము పరిష్కరించామన్నారు, ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. వేతనాల పెంపు అంశంపై కూడా ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5,000 మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి కేంద్రాలుగా మారుస్తున్నామని, దీనివల్ల వేలాది మందికి టీచర్లుగా పదోన్నతులు దక్కుతాయన్నారు. అదనంగా మరో 5,000 మంది సహాయకుల నియామకానికి శ్రీకారం చుట్టామన్నారు.ఆధునిక వసతులు: రూ.75 కోట్ల వ్యయంతో 58,204 మందికి 5జి స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశామని, అలాగే టీవీలు, ఆర్‌ఓ ప్లాంట్లు, ఇండక్షన్ స్టవ్‌లను అందు బాటులోకి తెచ్చామన్నారు. గ్రాట్యుటీకి శ్రీకారం: దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీల గ్రాట్యుటీ కలను నిజం చేస్తూ, 2025 బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించిన ఘనత తమదేనని ఆయన తెలిపారు. అంగన్వాడీల 11 డిమాండ్లలో ఇప్పటికే 9 డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించిందని గుర్తు చేశారు. అంగన్వాడీలు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం మీ సమస్యల పట్ల బాధ్యతగా ఉందని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకుందామని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు విజ్ఞప్తి చేశారు

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆనందబాబు



**వేమూరు మార్చి 1, (ప్రభాతవార్త) :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వేమూరు మండలం వివిధ గ్రామాలకు చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందింది. ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్సలు పొందిన బాధితుల వైద్య ఖర్చుల బిల్లులను వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు వారి రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్ కార్యాలయానికి పంపించారు. దరఖాస్తులను పరిశీలన అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కుల రూపంలో సహాయం మంజూరు చేయించారు. వేమూరు గ్రామానికి చెందిన కొండమూడి సుహాసినికి రూ.23,028,లు, కొమ్మూరు వెంకట సత్యవతికి రూ.61,239లు, అబ్బనగూడవల్లికి గ్రామంకు చెందిన కోసూరి సింగారావుకు రూ.33,084లు, అల్లంశెట్టి చెంచమ్మకు రూ.40,295లు, చావలి గ్రామంకు చెందిన సోమరౌతు బసవమ్మ రూ.1,17,621లు, దండే శివ నాగలక్ష్మీకి రూ.2,06,086లు, చదలవాడ గ్రామానికి చెందిన బొల్లిముంత అంకమ్మకు రూ.30,975లు, జంపని గ్రామంకు చెందిన తాటుకూరి దాసు రూ.22,000లు ఈ సందర్భంగా మొత్తం 8మందికి రూ.5,43,328లు మంజూరయ్యాయి. మంజూరైన మొత్తాన్ని లబ్ధిదారులకు మరియు వారి కుటుంబ సభ్యులకు చెక్కుల రూపంలో మాజీ మంత్రి, వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు ఆదివారం స్వయంగా అందజేశారు.

## అంగన్‌వాడీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే ఆనందబాబు

**వేమూరు మార్చి 1, (ప్రభాతవార్త) :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్నదని రాష్ట్ర మాజీ మంత్రి, వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవాడలో ధర్నా నిర్వహించనున్నారని సమాచారం అందిన నేపథ్యంలో శాసన సభ్యులు ఆనందబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మరియు సూపర్‌వైజర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సంపూర్ణ కట్టుబాటుతో పని చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీ సిబ్బందికి రెండు సార్లు వేతనాలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రాల మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించబడిందని, రాష్ట్ర వ్యాప్తంగా త్రాగునీరు, మరుగుదొడ్లు, నిర్మాణానికి రూ.86.68లక్షలు విడుదల చేసి ప్రతి కేంద్రానికి నిధులు కేటాయించబడినట్లు పేర్కొన్నారు. ప్రతి నెల 1వ తేదిన వేతనాలు చెల్లించే విధంగా శాశ్వత చర్యలు తీసుకున్నామన్నారు. 58,204మంది అంగన్‌వాడీ సిబ్బందికి రూ.75కోట్ల వ్యయంతో 5జి స్మార్ట్ ఫోన్లు అందజేశామని అంగన్‌వాడీ కేంద్రాల హాజరు శాతం 70శాంతి నుండి 96శాతం వరకు పెరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బంది దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న గ్రాట్యుటీ అమలు చేసి 2025బడ్జెట్‌తో రూ.20కోట్లు కేటాయించామని, ఇకపై కూడా అంగన్‌వాడీ సిబ్బంది ప్రతిపాదించిన మిగిలిన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ధర్నాలు, ఆందోళనలకు బదులుగా పరస్పర చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుందామని, అంగన్‌వాడీ కార్యకర్తలు శాంతియుతంగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం-కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ మీతోనే ఉంటుందని ఆనందబాబు పేర్కొన్నారు.



## డివిజన్ స్థాయిలో నేనే బాస్

### అధికారి ప్రవర్తనతో సిబ్బంది బెంబేలు

**బాపట్ల. మార్చి1. ప్రభాతవార్త:** నేనెవరో తెలుసా.. నా బ్యాక్‌గ్రౌండ్ ఏంటో తెలుసా? ఈ డివిజన్‌లో నేనే బాసును.. నా తర్వాతే ఎవరైనా! ఇవి బాపట్ల జిల్లాలోని ఒక డివిజనల్ స్థాయి అధికారి నిత్యం తన కింది స్థాయి సిబ్బందిని, మండల అధికారులను ఉద్దేశించి చేస్తున్న హుంకారాలు. నిబంధనలకు పాతర వేస్తూ, అధికార గర్వంతో సదరు అధికారి చేస్తున్న బెదిరింపులకు భయపడి పలువురు అధికారులు నోరు మెదపలేక లోలోపల మదనపడుతున్నారు.తీర ప్రాంతంలోని ఓ మండలంలో ప్రభుత్వ భూములు (డీకే పట్టా) ఆక్రమించి నిర్మించిన రిసార్టు వ్యవహారం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్మాణాల వెనుక సదరు అధికారి హస్తం ఉన్నట్లు బలమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లోతైన విచారణ జరిపితే ఈ అధికారి లీలలు మరిన్ని బయటపడే అవకాశం ఉందని సమాచారం. గతంలో అద్దంకి బాపట్ల జిల్లాలో ఉన్నప్పుడు భారీగా ఆదాయం వచ్చేదని, అది ప్రకాశం జిల్లాలో కలవడంతో.. ఇప్పుడు ఆదాయం కోసం మరో ఆదాయం వచ్చే ప్రాంతానికి వెళ్లేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.స్థానిక ప్రజాప్రతినిధి తనకు అత్యంత సన్నిహితుడని ప్రగల్భాలు పలికే ఈ అధికారి, తెరవెనుక మాత్రం మాజీ ప్రజాప్రతినిధుల పనులు చక్కబెడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నేతల పనులను నెలల తరబడి పెండింగ్‌లో పెడుతూ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడంతో సొంత పార్టీ నేతలే సదరు అధికారిపై మండిపడుతున్నారు. గతంలో విధుల్లో నిర్లక్ష్యంపై మెమో జారీ అయితే, అమరావతిలో చక్రం తిప్పి గండాన్ని గట్టెక్కారని కార్యాలయంలో గుసగుసలు వినిపించాయి. తీర ప్రాంతాల్లో సి ఆర్ జెడ్ నియమ నిబంధనలు ఉల్లంఘించి ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్న అటు వైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శలు గుప్పిస్తున్నాయి.

### విధుల పట్ల నిరక్ష్యం.. కలెక్టర్ నోటీసులిచ్చినా అదే తీరు!

**కలెక్టర్ ఆగ్రహం..:**

సదరు అధికారి పనితీరుపై జిల్లా ఉన్నతాధికారి అసహనంతో ఉన్నట్లు సమాచారం.ఇప్పటికే విధుల్లో నిరక్ష్యం వహించినందుకు మూడుసార్లు ఖికాషన్ నోటీసులుఖి జారీ చేసినట్లు సమాచారం. కాగా సదరు అధికారి కార్యాలయంలో ఖిసీసీఖిగా పనిచేస్తున్న ఆ వ్యక్తి అన్ని వ్యవహారాలను చక్కబెడుతున్నాడని, ఆ వ్యక్తిపై కూడా అనేక ఆరోపణలు ఉన్నాయని సిబ్బంది వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా తన పలుకుబడితో వేరే జిల్లాకు బదిలీ చేయించుకుని బయటపడేందుకు సదరు అధికారి ప్రయత్నాలు ముమ్మరం చేయడం గమనార్హం.

## రేపల్లె డిఎస్పీ ఆధ్వర్యంలో వజ్రా పహార్ కార్డెన్ సెర్చ్

**కొల్లూరు, మార్చి 1, (ప్రభాతవార్త) :** కొల్లూరు మండలం కొల్లూరు గ్రామంలో ఆదివారం బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు



రేపల్లె డిఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వజ్రపహార్‌లో భాగముగా కార్డెన్ సెర్చ్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. దానిలో భాగంగా ఎటువంటి డాక్యుమెంట్స్ లేని 70 టూ వీలర్స్, ఒక ఆటోను సీజ్ చేయడం జరిగిందని డిఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఈ కార్డెన్ సెర్చ్ కార్యక్రమం 70రోజుల పాటు ఈ ప్రోగ్రాం మరింత కట్టుదిట్టంగా తనిఖీలు జరుగుతాయని డిఎస్పీ తెలిపారు. స్పష్టంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గంజాయి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా యువత గంజాయికి బానిసలై క్రైమ్ దారిలోకి వెళ్ళకుండా పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. గంజాయి రవాణా, నిల్వ, విక్రయ ఎక్కడైనా గుర్తించిన ఉపేక్షించేది లేదని చర్యలు తప్పవని డిఎస్పీ తెలిపారు. ఈ ప్రోగ్రాంలో రేపల్లె టౌన్ రూరల్ సిఐలు, వేమూరు సిఐ పి.వి.ఆంజనేయులు, చుండూరు సిఐ, సబ్ డివిజనల్ పరిధిలోని ఎస్సైలు చెరుకుపల్లి, నగరం, భట్టిప్రోలు, వేమూరు, రేపల్లె టౌన్, చోడయపాలెం, అమృతలూరు, చుండూరు మరియు సిబ్బంది 110మంది ఎక్సైజ్ ఈగల్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## జనసేన ఉద్యమి సభ్యత్వాలు నమోదు చేయాలి

**కొల్లిపర,మార్చి 1, ప్రభాతవార్త:** అత్యధిక సంఖ్యలో జనసేన ఉద్యమి సభ్యత్వాలను నమోదు చేయాలని కొల్లిపర జనసేన మండల పార్టీ అధ్యక్షుడు యర్రు వెంకయ్యానాయుడు చెప్పారు.ఆదివారం మండలంలోని అత్తోట గ్రామంలో జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమి సభ్యత్వ



నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత జనసేన పార్టీ నాయకులపై ఉందన్నారు.పార్టీ కమిటీలో ప్రాధాన్యత లభించాలంటే ఉద్యమి సభ్యత్వ నమోదుతోనే సాధ్యపడుతుందని ఆయన స్పష్టం చేశారు.ఉద్యమి సభ్యత్వ నమోదు ఉంటే వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ప్రమాద భీమా సదుపాయం లభిస్తుందన్నారు.జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వెంకయ్యానాయుడు చెప్పారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పొలిశెట్టి శ్రీరామాంజనేయులు,తుంగల గోపి, బొద్దులూరి దిలీప్,చందు సత్యనారాయణ,యర్రు వెంకటేశ్వర్లు,మెట్రో శ్రీనివాసరావు, బొల్లిముంత బాపారావు,యర్రు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాదిగ అమరవీరుల దినోత్సవం

**వట్టిచెరుకూరు, మార్చి 1, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మేజర్ పంచాయితీ గ్రామం ముట్లూరు బాబు జగజ్జివన్ రామ్ కాలనీలో ఆదివారం మాదిగ అమరవీరుల దినోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పోరులో అసువులు బాసిన మాదిగ అమర వీరులకు పూలమాలలు వేసి జోహార్లర్పించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ నేతలు మాట్లాడుతూ ఎస్సీలో ఉండే 59 ఉపకులాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ రంగాలలో సామాజిక న్యాయం జరగాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మూడు దశాబ్దాల ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రస్థానంలో




ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరిగిన అనేక ఉద్యమ ఘట్టాలలో వీరోచితమైన పాత్రను పోషించి, జాతి లక్ష్యాన్ని సాధించడం కోసం తృణప్రాయంగా తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించి, తరతరాల జాతిలోని చీకటిని పారద్రోలుతూ జాతికి వెలుగులు తీసుకొచ్చినట్లు తెలియజేశారు. ఈ ఉద్యమ పోరుబాటలో అనేకమంది మాదిగ బిడ్డలు అసువులు బాసారని, వారి అమరత్వం సాక్షిగా వర్గీకరణ సాధిస్తామని ప్రమాణం చేశామని గుర్తు చేశారు. నేడు ఆ ప్రమాణం సాక్షిగా ఎస్సీ వర్గీకరణ సాధించి అమరుల ఆశయాలను నెరవేర్చి ఎస్సీ వర్గీకరణ ఫలితాలు మాదిగ బిడ్డలు పొందుతున్నారని చెప్పారు. మాదిగ అమరులను మది నిండా తలచుకొని ఘనమైన నివాళులు అర్పిద్దాం.వారి త్యాగాలను ప్రపంచానికి ఎలుగెత్తి చాటి చెప్పుదాం అని అమరుల త్యాగాలను స్మరించుకుని పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఇతర వర్గాల మద్దతు తీసుకోని తిరిగి సమాజ మేలుకోసం ఎమ్మార్పియస్ ఆరోగ్యశ్రీ, వికలాంగులు, వృద్ధులు, వితంతువుల పెన్షన్ల పెంపు కోసం ఉద్యమాలు చేసి ఫలితాలు సాధించిపెట్టిందన్నారు. భవిష్యత్ లో అన్ని వర్గాలను ఏకంచేసి మహాజన రాజ్యం సాధించడం కోసం ముందుకు సాగుతమని వివరించారు.కార్యక్రమంలో ఎడ్లూరి అనిల్ కుమార్, బుర్రి వినోద్ కుమార్, వై. మరియదాసు, దుడ్డు కోటేశ్వరరావు, జి.మనోహర్ బాబు, బుర్రి నాగేశ్వరరావు, బి. మధుబాబు, ఎడ్లూరి బాబురావు, బెంజిమెన్, చిలీ యేసు, యేసుపాదం, గోరికపూడి రత్తయ్య, తదితర ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నేతలు పాల్గొన్నారు.

## దీపావళి టపాసుల నిల్వలను గోదాములకు తరలించాలి

### -రేపల్లె డిఎస్పీ శ్రీనివాసరావు

**రేపల్లె, మార్చి 1, ప్రభాతవార్త:** రేపల్లె పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని దీపావళికి తాత్కాలిక అనుమతి పొందిన టపాసులు,మందుగుండు సామగ్రి,ఇతర ప్రేలుడు పదార్థాల నిల్వలు ఉంటే వెంటనే ప్రభుత్వ అనుమతి పొందిన గోదాములకు తరలించాలని డిఎస్పీ ఆవుల శ్రీనివాసరావు ఆదేశించారు.ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపల్లె,నిజాంపట్నం,నగరం,చెరుకుపల్లి,భట్టి ప్రోలు,కొల్లూరు ,వేమూరు, అమృతలూరు, చుండూరు మండలాల పరిధిలో టపాసులు, ప్రేలుడు పదార్థాలు నిల్వలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .టపాసుల నిల్వల సమాచారాన్ని తెలిపేవారికి తగిన ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని డిఎస్పీ శ్రీనివాసరావు చెప్పారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని ఆయన కోరారు.



## నరేంద్రమోడీ పాలనలో ప్రజల సంక్షేమం

**రేపల్లె, మార్చి 1, ప్రభాతవార్త:** భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాలనలో ప్రజల సంక్షేమం నెరవేరుతున్నదని భారతీయ జనతా పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బంగారు బాబు చెప్పారు.ఆదివారం భారతీయ జనతాపార్టీ



రేపల్లె రూరల్ కన్వీనర్ డేనియల్ బాబుని పరామర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు తెలిపారు.రేపల్లె నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి నాయకులు,కార్యకర్తలతో బంగారు బాబు చర్చించారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు పిన్ని సాంబశివరావు,బిజెపి పట్టణ అధ్యక్షుడు శివరామప్రసాద్,నగరం బిజెపి అధ్యక్షుడు సురేష్,నిజాంపట్నం బిజెపి అధ్యక్షుడు జయరాం,చింతయ్య,కిషోర్,చంద్రశేఖర్,బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## భక్త జనరంజకంగా శ్రీ జనార్ధనస్వామి బ్రహ్మోత్సవాలు

**కొల్లిపర, మార్చి 1, ప్రభాతవార్త:**

కొల్లిపరలో కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధనస్వామి దేవాలయంలో ఆదివారం వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా



ముగిశాయి.బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ జనార్ధనస్వామికి ప్రత్యేక అలంకరణ చేసి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను ఆలయ పండితులు జగన్నాధాచార్యులు,యోగానంద పృధ్విభార్గవ్,వీరభద్రేశ్వర శర్మ,వెంకటేశ్వర శర్మ,పరాచరం నరసింహ శర్మ,సీతారామా చార్యులు,నాగరాజు శర్మలు నిర్వహించారు.స్వామి వారికి అభిషేకాలు చేశారు.ప్రాధాన్యత కలిగిన పూలతో పూజలు చేశారు.స్వామి వారికి విష్వక్సేన ఆరాధన పుణ్యాహ వచన,రక్షాధారణ,ధ్వజారోహణ కార్యక్రమాలు జరిగాయి.అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు మంత్రపుష్పంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు.

## జనసేన పార్టీ నేత కాటూరికి ఘన సత్కారం

**వట్టిచెరుకూరు, మార్చి 1, ప్రభాతవార్త :** జనసేన పార్టీ ప్రతిష్టాత్మంగా చేపట్టిన క్రియాశీల సభ్యత్వంలో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గం, గుంటూరు రూరల్ మండలం, లాల్పురం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నేత కాటూరు శ్రీనివాసరావు మాస్టర్ 500 పైగా సభ్యత్వాలు పూర్తి చేసిన సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరావు, సెంట్రల్ ఆఫీస్ కోఆర్డినేటర్ చందు సాంబశివరావు సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా చందు సాంబశివరావు, కొర్రపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో గుంటూరు రూరల్ మండలం నుంచి అత్యధికంగా జనసేన పార్టీ సభ్యత్వాలు జరగటం ఆనందదాయకమన్నారు. కార్యక్రమాన్ని నాయకులు ముందుండి సాధక్ లను సమన్వయం చేసుకుంటూ సభ్యత్వాలు అధిక మొత్తంలో అయ్యేటట్టు కృషి చేయాలని ఆకాంక్షించారు. గత సంవత్సరం కూడా ప్రత్తిపాడు నియోజకవర్గంలో లాల్పురం గ్రామం నుంచి వ్యక్తిగత అత్యధిక సభ్యత్వాలు నమోదుచేయడం జరిగిందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా గ్రామం నుంచి మొదట 500 పూర్తి చేయడం లాల్పురం జనసేన పార్టీకి బలమైన గ్రామంగా ఉందని వివరించారు. శ్రీనివాస్ మాస్టర్ ని స్ఫూర్తిగా తీసుకొని నియోజకవర్గంలో ప్రతి గ్రామం నుండి సభ్యత్వాలు అత్యధిక సంఖ్యలో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ లేబర్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ చింతా రేణుక రాజు, కార్పొరేటర్ అయిశెట్టి శ్రీనివాస్, నాగినేని సునీల్ కుమార్, అక్కి రవి, శేషం చిన్న సుబ్బారావు, డి. లక్ష్మీనారాయణ, సజ్జల రవి, వి.రాంబాబు, పి.వీరయ్య, చెన్నం గోపి, తోట వెంకటేష్, ఆకుల శేషు, అమ్ములోతు రాంబాబు, ఆదూరి శివయ్య, సేలం హరి, తదితర జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## ఉపగ్రహాల పై విద్యార్థులకు అవగాహన



**భట్టి ప్రోలు(రేపల్లె), మార్చి 1, ప్రభాతవార్త:** రోదసీలోకి ఉపగ్రహాలను పంపే విధానాన్ని గురించి అద్దేపల్లిలోని సిద్ధార్థ ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.సైన్స్ డే సందర్భంగా చంద్రయాన్ ఉపగ్రహాన్ని ఉదాహరణగా చూపుతూ ఒక ప్రాజెక్టుని మోడల్‌గా తీసుకుని అవగాహన కల్పించారు.విద్యార్థులకు సైంటిఫిక్‌గా నాలెడ్జ్‌ని అందించారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వేల్పూరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలిస్తే చర్యలు

**కొల్లిపర, మార్చి 1, ప్రభాతవార్త:** మైనర్లకు వాహనాలిచ్చే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కొల్లిపర ఎస్ఐ ఎన్‌సి ప్రసాద్ హెచ్చరించారు.ఆదివారం మండలంలోని దావులూరు,చివలూరు, కొల్లిపర,తూములూరు తదితర గ్రామాలలో ఎస్ఐ తన సిబ్బందితో రహదారి



వాహనాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ ఎన్‌సి ప్రసాద్ మాట్లాడుతూ ఎవరైతే వాహనం నడుపుతున్నారో వారికి ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు.లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు.ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు ప్రయాణం చేస్తున్నందున ప్రమాదాలు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు.ప్రతి వాహనానికి విధిగా నెంబరు ప్లేటు స్పష్టంగా కనిపించేలా ఉండాలన్నారు.నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎన్‌సి ప్రసాద్ చెప్పారు.

## క్రాకర్స్ గోడౌన్స్ ఆకస్మిక తనిఖీ

**నగరం, మార్చి1, ప్రభాతవార్త:**

ఇల్లీగల్ క్రాకర్స్ ఉన్నట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రేపల్లె రూరల్ సీఐ సురేష్, నగరం ఎస్సై భార్గవ్ తెలిపారు.

ఆదివారం నగరం మండల పరిధిలోని సజ్జవారిపాలెం శ్రావణి ఫ్యాన్సీ ఫైర్ వర్క్స్, చిలకవారిపాలెంలో శ్రీ శివ శ్యాంక్ ఫైర్ వర్క్స్ షాపులను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రాకర్స్ గోడౌన్స్ భద్రతా ప్రమాణాలు పాటించాలని షాపు యజమానులకు తెలియజేశారు. ఇల్లీగల్ క్రాకర్స్ ఉన్నట్లయితే వెంటనే లైసెన్స్ ఉన్న గోడౌన్లకు తరలించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పల్నాడు జిల్లా వార్త



## పేద విద్యార్థినికి రూ. 20 వేల ఆర్థికసాయం

రొంపిచర్ల,మార్చి 1 ప్రభాతవార్త : :బొల్లా రాజేశ్వరి కృష్ణారావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభ కలిగిన పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందజేశారు. బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న జొన్నలగడ్డ గ్రామానికి చెందిన దరియా సుల్తానా బేగం కు రూ. 20000 చెక్కును



అందజేశారు. చదువులో మంచి ప్రతిభ ఉండి పేదరికంతో ఏ విద్యార్థి ఆగిపోకూడదని తమ ట్రస్ట్ ఈ కార్యక్రమం నిర్వహించిందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. భవిష్యత్తులోనూ పేద,ప్రతిభ ఉన్న విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. విద్యార్థిని సుల్తానా బేగం కుటుంబ సభ్యులు ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బొల్లా వెంకట కృష్ణారావు, మేనేజింగ్ ట్రస్టీ బొల్లా వెంకటేశ్వర్లు, ట్రస్ట్ సభ్యులు మర్రిపాటి రామకృష్ణ, బొల్లా రాజేంద్రప్రసాద్ జాస్తి గోపాలకృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రశేఖర్ కుటుంబానికి డాక్టర్ కోడెల శివరాం పరామర్శ

నరసరావుపేట టౌన్ మార్చి 1 ప్రభాతవార్త : నరసరావుపేట 3 వార్డు పరిధిలోని నిమ్మతోటలో ప్రముఖ న్యాయవాది చంద్రశేఖర్ తండ్రి జగన్నాథం ఇటీవల అకాలమరణం చెందారు. టీడీపి



కార్యకర్తల ద్వారా తెలుసుకొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరాం ఆదివారం చంద్రశేఖర్ ఇంటికి వెళ్లి, జగన్నాథం చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు చేపట్టాలి: పిడిఎం

నరసరావుపేట క్రైమ్, మార్చి 1 ప్రభాతవార్త : స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని ఆవుల సత్రం ప్రక్కన ఉన్న కత్వ చెరువు డ్రైనేజీ కాలువలోపట్టపగలు ఆక్రమణదారులు యదేచ్ఛగా నిర్మాణాలు (పిల్లర్స్) చేస్తున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న నరసరావుపేట మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని పిడిఎం రాష్ట్ర కార్యదర్శి జి. రామకృష్ణ, నాయకులు నల్లపాటి రామారావు ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా ఉన్నత అధికారులను కోరారు. రెండు రోజుల క్రితం ప్రజాసంఘాల నాయకులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వెంటనే నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని నరసరావుపేట తాహసిల్దార్ కి, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సాంబయ్యని కోరామన్నారు. ఐతే టీపీవో సాంబయ్య పనులు ఆపించామని తమకు చెప్పడం జరిగిందన్నారు. కానీ, ఇప్పటికీ యదేచ్ఛగా పట్టపగలు నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయని ఆరోపించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారులతో కుమ్మక్కైన సాంబయ్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయులకు చేతిరాతలో శిక్షణ

నరసరావుపేట, మార్చి 1 ప్రభాతవార్త :: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పిల్లల చేతిరాత మార్చడమే ధ్యేయంగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు చేతిరాత లో ఆదివారం శిక్షణ ఇచ్చారు.జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రామ్మోహన్ రావు, ఆధ్వర్యంలో క్యాలిగ్రఫీ టీం ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్



సహకారంతో ఖిఉపాధ్యాయులకు ఉచిత చేతిరాత శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పిల్లల ఉన్నతికి ఎంతో శిక్షణ దోహదపడుతుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు తమ వంతు సహాయ,సహకారాలు అందిస్తామన్నారు.పల్నాడు జిల్లా విద్యాభివృద్ధికి ఇది ఎంతో ఉపయోగ పడతుందని సుబ్బరాయ గుప్తా పేర్కొన్నారు . శిక్షణా కార్యక్రమంలో శిక్షకులు వి. రామ్మోహన్రావు, బి.లాల్ అహమ్మద్ ,టీ.శ్రీనివాస రావు , ఎస్ ఎస్ అండ్ ఎన్ కళాశాల అధ్యాపకులు మహేష్, ఉపాధ్యాయులు జగదీష్, సత్యనారాయణ, బురాన్, శారద,జయలక్ష్మీ తదితరులు శిక్షణ మెలుకువలు నేర్పించారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట, మార్చి 1 ప్రభాతవార్త :: పట్టణంలోని ఎనిమిదవ వార్డులో ఆదివారం నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమానికి పట్టణ అధ్యక్షులు షేక్ కరీముల్లా అధ్యక్షత వహించారు. వార్డు పరిధిలోని మైనార్టీ సోదరులను ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి ఇఫ్తార్ విందు శుభాకాంక్షలు



తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. ముస్లిం సోదర కుటుంబ సభ్యులను పలకరించి, వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ మైనార్టీలకు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి, ఆయన తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. వైఎస్ఆర్ సీపీకి మైనార్టీలు అండగా ఉన్నారని తెలిపారు. వారి సంక్షేమం, అభివృద్ధి కి భవిష్యత్తులోనూ తమ పార్టీ పెద్దపీట వేస్తుందని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ ముస్లిం మైనార్టీ విభాగం నాయకులు, వార్డు పెద్దలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 1100 కాల్ సెంటర్ సేవలు సద్వినియోగం చేసుకోండి: కలెక్టర్

నరసరావుపేట,మార్చి 1 ప్రభాతవార్త :: సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్లో ప్రజల



నుంచి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోనూ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిరించాలని ఆదేశించారు. దరఖాస్తులు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏదశలో ఉందో తెలుసుకునేందుకు బాధితులు ఆన్లైన్ ద్వారా కానీ లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## లక్ష్మీనరసింహస్వామి దేవాలయ నిర్మాణానికి దాతల విరాళం

నరసరావుపేట టౌన్,మార్చి 1 ప్రభాతవార్త :: పట్నంలోని కోట సెంటర్ పులుపుల వారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయ సహిత యోగానంద సహిత లక్ష్మీ ృనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు విరాళం అందజేశారు. వివరాలను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు వనమా శివ తెలియజేశారు. ఆలయ ముఖ మండపంలోని 24వ రాతి స్తంభానికి, 23వ రాతి స్తంభానికి



దాతలు మూడు లక్షల రూపాయల విరాళం అందజేశారు అన్నారు. మండవ సీతారామాంజనేయులు,పూర్ణచంద్రరావు,మధుసూదన్ రావు,వెంకట్ రెడ్డి,రంజిత్,ఆదినారాయణలు ఈ మొత్తం అందజేయడం జరిగిందన్నారు. దాతలకు స్వామివారి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వనమా శివ, వనమా కృష్ణ, శివ శీను బాబు, మురళి, నాగేశ్వరరావు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన 'రంగస్థలం' జాతీయ ఆహ్వాన నాటక పోటీలు

నరసరావుపేట, మార్చి 1 ప్రభాతవార్త :: నరసరావుపేట రంగస్థలం 46 వార్షికోత్సవం సందర్భంగా మూడోరోజు ఆదివారం 25వ జాతీయస్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలు ఘనంగా జరిగాయి. ముగింపు రోజున కార్యక్రమాన్ని గౌరవ అధ్యక్షులు కిలారి వెంకట్రావు, అధ్యక్ష కార్యదర్శులు మహబూబ్ సుభాని, నల్లపాటి రామచంద్రబోస్, ఉపాధ్యక్షులు మస్తాన్రావు,ప్రసన్నకుమార్, కమిటీ సభ్యులు ఏఏ మధు కుమార్,మూర్తి,సూరిబాబు,సుబ్బరాయుడు, భాషా,పుల్లారావు, వెంకట్రావు, రవి,శివరామిరెడ్డిలు పర్యవేక్షి ంచారు. చివరి రోజున కేరి జి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థినీ



విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన చేశారు. జ్యోతి రాజ్ రచించిన అమ్మ చెక్కిన బొమ్మ నాటికకు వెంకట్ దర్శకత్వం వహించారు. నటీనటులు తమ నటనతో నాటికలో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. పురాణ కాలం నుండి స్త్రీ పురుషుడు కానటువంటి వారు ఎటువంటి అవమానాలు ఎదుర్కొన్నారు,వారిని ఏ విధంగా సమాజం గౌరవించాలి అనే సందేశాన్ని ఇచ్చింది. అదేవిధంగా రెండోనాటికగా హైదరాబాద్ వారి గేమ్ నాటిక ను మంజునాథ రచించి దర్శకత్వం వహించారు.



సరదాలు వ్యసనాలుగా మారి ఏ విధమైనటువంటి ప్రమాదాలను మనిషి జీవితంలోకి తీసుకు వస్తాయో , ముఖ్యంగా బెట్టింగ్ వంటివి జీవితాలను ఏ విధంగా తలకిందులు చేస్తాయో తెలియజేసింది. ఈ రెండు నాటిక ప్రదర్శనలను డాక్టర్ కట్టా సాయి రమ్య,డాక్టర్ కట్టా సాయి తేజ లతో పాటు చిరుమామిళ్ల రాములు సమర్పించారు. సభ ముగింపు కార్యక్రమాన్ని పుల్లారావు నిర్వహించారు. ముగింపు సభలో ప్రముఖ రంగస్థలం నటి ద్రాక్షారామం సరోజా కు ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. ముఖ్య అతిథులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరయ్యే మాట్లాడారు. రంగస్థలం నాటక రంగానికి చేస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. పల్నాడు జిల్లాలో రచయితలకు, నటీ,నటులకు మంచి ప్రోత్సాహకాన్ని అందించే ఇటువంటి సంస్థలు భవిష్యత్తులోనూ జీవించాలని ఆకాంక్షి ంచారు. ప్రభుత్వ పరంగాను వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామని ఎంపీ కృష్ణదేవరాయలు తెలియజేశారు. సభా కార్యక్రమములో ప్రముఖులు నల్లపాటి రాము, షేక్ మీరావలి, బిఆర్ సుశీల్ కుమార్, డాక్టర్ కట్టా రమేష్,చిరుమామిళ్ల రాము, కట్టా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాభవానికి ఉమెన్ పవర్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు పురస్కారం

నరసరావుపేట,మార్చి 1 ప్రభాతవార్త :: పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పాల్వాయి గ్రామానికి చెందిన ఉప్పు దుర్గాభవానికి ఉమెన్ పవర్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు 2026 పురస్కారం లభించింది. అవార్డు గ్రహీత వివరాలను ఆదివారం తెలిపారు. విజయవాడ బాలోత్సవ భవన్ లో ఆదివారం విశ్వసాహితీ కళా వేదిక అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించిందన్నారు.




ప్రముఖులు గజల్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరవ్వడం జరిగిందన్నారు. ఈ వేదికపై గత 15 సంవత్సరాలుగా గుంటూరు జిల్లా కోర్టు నందు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న తన సేవలను గుర్తించి పురస్కారం అందించారని పేర్కొన్నారు. సభలో వక్తలు మాట్లాడుతూ పురస్కార గ్రహీత దుర్గాభవాని ఎన్నో ఏళ్లుగా ఫ్యామిలీ, చైల్డ్ కౌన్సిలర్ గా సేవలందిస్తున్నారని తెలిపారు. వారి సేవలకు ఈ పురస్కారం సముచిత గౌరవాన్ని ఇచ్చింది అన్నారు. జాతీయ సాహిత్య,సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ చైర్ పర్సన్ కొల్లి రమావతి, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ న్యాయవాది దుర్గ భవానిని ఈ సందర్భంగా అభినందించారు.



**అమరావతిలో ఏపీ జ్యూడిషియల్ అకాడమీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హైకోర్టు న్యాయమూర్తులు, అధికారులు. (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)**

## ప్లాట్ మాయలో పెట్టుబడిదారుల కన్నీరు!

-రియల్ స్కాంలో మహిళ - హైదరాబాద్ పోలీసుల వద్ద ఇప్పటికే అక్రమార్కుల చిట్టా !?

-గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సైతం ఖిలాడీ కదలికలు !?

సత్తెనపల్లి, మార్చి 1, ప్రభాతవార్త: ఒక లేడీ కిలాడిగా మారింది.. ఆమెకు సంబంధించిన స్థలం ఆస్తిని ఒకరికి కాదు.. ఏకంగా ముగ్గురికి విక్రయించినట్టు సమాచారం.. ముగ్గురికి అగ్రిమెంట్ చేసి తెలివిగా డబ్బులు గుంజేసిందని, ఒకరి విషయం మరొకరికి తెలియకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించిందని అంటున్నారు. ఈ కిలాడి చేసిన పనికి అగ్రిమెంటు రాయించుకున్న ముగ్గురు వ్యక్తులు విస్తు పోయారు.. ఒకరి దగ్గర రూ. మూడు లక్షలు, మరొకరి దగ్గర రూ. ఐదు లక్షలు, ఇంకొకరి దగ్గర మొత్తం రూ. 61 లక్షలు కొట్టేసిందని. దీంతో అగ్రిమెంట్ చేయించుకున్న వ్యక్తులు ఏం చేయాలో పాలు పోక అల్లాడిపోతున్నారు.. మరో విషయం ఏమిటంటే ఈ స్థలం వివాదం న్యాయస్థానంలో కూడా ఉన్నట్లు ఆమె దగ్గర అగ్రిమెంట్ చేయించుకున్న బాధితులు వాపోతున్నారు.. బాధితులు గుంటూరు పోలీసులను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడింది.. ఒకరికి తెలియకుండా మరొకరికి అగ్రిమెంట్లు రాసి అక్రమంగా డబ్బులు గుంజిన ఈమె హైదరాబాదులో ఉంటున్నట్లు సమాచారం.. ఈ స్థలం అగ్రిమెంటు రాయించుకున్న ఒక వ్యక్తి మిగతా ఇద్దరితో సెటిల్మెంట్ చేసుకున్న తర్వాత.. అదనంగా తనకు మరో కోటి రూపాయలు ఇస్తేనే తాను రిజిస్ట్రేషన్ చేస్తానని ఆమె అడ్డం తిరిగినట్లు ఒక బాధితుడు తన బాధను వెళ్ళబోసుకుంటున్నాడు.. ఈ సంఘటన ఇటీవల ఉమ్మడి గుంటూరు జిల్లాలో జరిగింది.. ఆమె తన మాటలతో హైదరాబాదులో కూడా ఒకే ఫైల్ లో తన చేతివాటాన్ని ప్రదర్శించినట్లు బాధితులు చెబుతున్నారు.. బాధితులు అందరూ ఆమెకి నేరుగా డబ్బులు పంపామని ఈ ఆధారాలు పుచ్చుకొని పోలీసులను ఆశ్రయించేందుకు సమాయత్తమవుతున్నారు.. అంతేకాకుండా ఒంగోలు రియల్ ఎస్టేట్ వ్యాపారి దగ్గర నుండి ఈ లేడీ తమ్ముడు రూ.20 లక్షలు అప్పనంగా దండుకున్నట్లు చెప్పారు. అలాగే గుంటూరు బిల్డర్, రియల్ ఎస్టేట్ వ్యాపారి దగ్గర స్థలం రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పి ఆ మహిళ లక్షలు గుంజినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఆ మహిళ, ఆమె తమ్ముడు, మాజీ బ్యాంకు మేనేజర్ విక్రయించిన స్థలానికి సంబంధించి మరికొంతమంది వారసులు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఆ మహిళ చేస్తున్న అక్రమాలను తెలుసుకున్న అసలైన స్థల యాజమాన్యం వచ్చి గుంటూరులో ఆమె చేతిలో మోసపోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారిని కలిసి అన్ని వివరాలు తెలుసుకున్నారు. అంతేకాదు ఈ కిలాడీ లేడీ హైదరాబాదులో ఉన్న తన సమీప బంధువులను కూడా దారుణంగా చీట్ చేసినట్లు సమాచారం.ఈ మహిళ మోసాలను గుర్తించిన ఆమె బంధువులు కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలిసి గుంటూరులో పోలీసులను ఆశ్రయించేందుకు సమాయత్తమవుతున్నారని సమాచారం.

## మహిళ సాధికారతే లక్ష్యంగా పోలీస్ శాఖ, విద్యార్థుల అవగాహన ర్యాలీ

నరసరావుపేట క్రైమ్, మార్చి 1 ప్రభాతవార్త ::మహిళలు అన్ని రంగాలలో పురుషులకు దీటుగా రాణిస్తున్నారని,దేశ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, మాజీ ప్రదాని ఇందిరాగాంధీ,పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, మాజీ ఐపిఎస్ కిరణ్ బేడీ ఇలా ఎంతో మంది మహిళలు ఉన్నత రంగాలలో స్థిరపడ్డారని పలువురు మహిళా పోలీసు అధికారులు అన్నారు.ఈ నెల 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా పల్నాడు జిల్లా ఎస్.పి బి.కృష్ణారావు ఆదేశాల మేరకు శనివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఎస్.ఎస్.ఎన కళాశాల వద్ద నుండి బస్టాండ్ వరకు, సత్తెనపల్లి డి.ఎస్.పి కార్యాలయం వద్ద నుండి 5 లాంతర్ల సెంటర్ వరకు,మాచర్లలో పోలీస్ స్టేషన్ మహిళ పోలీసులు మహిళ పోలీసు సిబ్బంది, పాఠశాలలు, కళాశాల విద్యార్థినులతో ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మహిళా సాధికారత, చైతన్యం, ప్రగతి నినాదాలు చేశారు. మహిళా పోలీసు సిబ్బంది మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలకు పురుషులతో పాటు సమాన



అవకాశాలు ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని రాజకీయాలలో సైతం ఎంతో మంది మహిళలు రాణిస్తున్నారన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులు, చట్టపరమైన హక్కులు, భద్రతా చర్యలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.మహిళలు ఎదుర్కొనే సమస్యలు ధైర్యంగా వెలుగులోకి తీసుకువచ్చి భద్రతకై ప్రభుత్వం,పోలీస్ శాఖ సేవలు పొందాలన్నారు. ఆయా కార్యక్రమాలలో ట్రైనీ ఐపిఎస్ నిరంజన్, గురజాల, నరసరావుపేట, డి.ఎస్.పి లు ఎం.వెంకటరమణ, ఎం.హనుమంతరావు, సిఐలు ప్రభాకర్,లోక్నాథం ,టూ టౌన్ ఎస్ఐ బి యస్సా,పలు పోలీస్ స్టేషన్ అధికారులు, ఎస్సైలు వివిధ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

## చంద్రగ్రహణం సందర్భంగా వైకుంఠపురం ఆలయం ముసివేత

**తెనాలి మున్సిపాలిటీ,మార్చి 1,(ప్రభాతవార్త):** పట్టణంలోని వైకుంఠపురంలో వేంచేసిన శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని మార్చి మూడవ తేదీ సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఉదయం నుండి రాత్రి వరకు మూసివేస్తున్నట్లు దేవాలయ కార్యనిర్వహణఅధికారి అనుపమ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 3 మంగళవారం కేతు గ్రస్త గ్రస్తోదయ సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఉదయం స్వామి అమ్మవార్లకు అర్చన మరియు మహానివేదన కార్యక్రమాల అనంతరం 8.15 గం ఆలయం మూసివేయడం జరుగుతుందని,తిరిగి మార్చి 4వ తేదీ బుధవారం ఉదయం 6 గంటలకు ఆలయ శుద్ధి అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించడం జరుగుతుందన్నారు



## శ్రీశివలింగేశ్వరస్వామి సేవా సమితి వారిచే అనాథ మృతులకు పిండ ప్రధానం

**తెనాలి మున్సిపాలిటీ, మార్చి 1,(ప్రభాతవార్త):** అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడమే కాకుండా వారి అస్థికలను కాశీలోని మణికర్ణిక ఘాట్ లో నిమజ్జనం నిర్వహిస్తూ, వారి పేరిట పిండ ప్రధానాలు చేస్తూ,అనాథ మృతదేహాలకు



ఆత్మబంధువుగా నిలుస్తున్న తెనాలి పట్టణానికి చెందిన శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవాసమితి అధ్యక్షులు కుర్రా శ్రీను మరియు సేవాసమితి సభ్యులు.గత ఎనిమిది సంవత్సరాలుగా తెనాలి పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనాథలుగా మరణిస్తే వారికి ఉచితంగా దహన సంస్కారాలు నిర్వహించడమే కాకుండా వారి అస్థికలను పవిత్ర కాశీలోని మణికర్ణిక ఘాట్లో నిమజ్జనం చేసి వారి పేరిట పిండప్రధానాలు చేస్తున్నామని సేవాసమితి అధ్యక్షులు కుర్రా శ్రీను తెలిపారు. గుంటూరు పట్టణానికి చెందిన శ్రీ జ్ఞాన ప్రసన్న మాతాజీ స్ఫూర్తితో, ఆకలిగా ఉన్నవారికి అన్నం పెట్టటం, అనాథలుగా నిస్సహాయులుగా ఎవరైనా మరణిస్తే వారికి ఉచితంగా దహన సంస్కారాలు నిర్వహించటం,తదుపరి వారి అస్థికలను పవిత్ర కాశీలోని గంగానదిలో నిమజ్జనం చేయటం, వారి పేరిట పిండ ప్రధానం చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించటం గత ఎనిమిది సంవత్సరాలగా దాతల చేయూతతో నిర్వహిస్తున్నామని సేవాసమితి అధ్యక్షులు కుర్రా శ్రీను తెలిపారు. అనంతరం సేవా సమితి సభ్యులు షేక్ మోలాలి మాట్లాడుతూ, శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృందం సేవా సమితి ఆధ్వర్యంలో తెనాలి పట్టణంలో గత ఎనిమిది సంవత్సరములుగా చేస్తున్న సేవా కార్యక్రమాలు ముఖ్యంగా, అనాథలకు అంత్యక్రియలు,అస్థికల నిమజ్జనం,పిండప్రధానం లాంటి కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం, ఎటువంటి కుల మత భేదాభిప్రాయాలు లేకుండా ఈ పవిత్ర రంజాన్ మాసంలో పాల్గొనటం ఆ భగవంతుని కృపగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత,ఎస్. రాంబాబు,ఎం.తేజాబాబు మరియు సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

# భవనాలను కోల్పోయిన యజమానులకు
# అందని నష్ట పరిహారం

**-టిడిఆర్ బాండ్ల కోసం నాలుగేళ్ళుగా నిరీక్షణ**
**-రూ.1.94 కోట్ల నష్టం నిర్ధారణ**

రేపల్లె-ప్రభాతవార్త

రహదారుల అభివృద్ధి వ్యవహారంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రేపల్లెలో భూములను కోల్పోయిన యజమానులకు నష్ట పరిహారంగా ప్రభుత్వం జారీచేసే "బదిలీ చేయదగిన అభివృద్ధి హక్కుల పత్రాల(టిడిఆర్)" మంజూరులో తీవ్ర తాత్సారం జరుగుతోంది.ప్రభుత్వ అవసరాలను తీర్చిన యజమానులు కాళ్ళరిగేలా మున్సిపల్,రహదారి భవనాల శాఖ,ఆర్డీఓ,జిల్లా కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా టిడిఆర్ బాండ్లు అందడంలేదు.కూటమి ప్రభుత్వం నిర్వహించిన 100 రోజుల సుపరిపాలన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్ళగా పరిష్కరిస్తాననే హామీనిచ్చి రెండో సంవత్సరం గడుస్తున్నా భూయజమానుల సమస్య పరిష్కారం కాలేదు.ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సైతం పరిష్కారం జరగకపోవడంతో భూములు కోల్పోయిన యజమానులు ఆందోళన చెందుతున్నారు.రేపల్లె ద్వితీయశ్రేణి పురపాలక సంఘంలోని 3,4,5 వార్డుల పరిధిలో అరవపల్లి రహదారి విస్తరణ పనుల కోసం గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని భూమి యజమానులు అంగీకరించారు.రహదారి విస్తరణాభివృద్ధిలో భాగంగా సైడు కాల్వలు,వీధి లైటింగ్,డివైడర్ వంటి సౌకర్యాలు కల్పించారు.ప్రభుత్వ అవసరాలు తీరిపోయాయి.4వ సంవత్సరం గడుస్తున్నా భూమి యజమానులకు టిడిఆర్ బాండ్లు పంపిణీలో కాలయాపన జరుగుతోంది.భూమి తీసుకున్నందుకు నగదుకు బదులుగా టిడిఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉంది.ఈ బాండ్లును బిల్డర్లకు విక్రయించి నగదు చేసుకునే వీలుంటుంది.నష్టపరిహారం చెల్లించలేని పరిస్థితులలో ప్రభుత్వానికి భూమి కోల్పోయిన వారికి టిడిఆర్ బాండ్లు ప్రయోజనకరంగానే ఉంటాయి.అయితే సంవత్సరాల కాలం దొర్లుతున్నా టిడిఆర్ బాండ్లు భూమి యజమానులకు అందడంలేదు.

**భవనాలకు జరిగిన నష్టపరిహారం..**

టిడిఆర్ బాండ్ల వ్యవహారం అలా ఉంటే అధికారులు నిర్దేశించిన మార్జిన్ల వరకు కోల్పోయిన భవనాలకు వాటిల్లిన నష్ట పరిహారం మంజూరు కావడంలేదు.మున్సిపల్,రహదారుల భవనాల శాఖలు ఎటూ తేల్చడంలేదు.కట్టడాలకు జరిగిన నష్టాన్ని పరిశీలిస్తే కోటి 94 లక్షల 68 వేల 266గా ఉంది.పినపాల సత్యసాయిబాబుకు రూ.22,79,504,అంకిశెట్టి నాగలక్ష్మికి రూ.5 లక్షల 5 వేల 016,కాళేపల్లి సాయికుమార్కు రూ.లక్షా 81 వేల 719,కోట రామచంద్రరావుకు రూ.5 లక్షల 63 వేల 637,కొత్తమాసు నాగేశ్వరరావుకు రూ.14 లక్షల 1675,వేముల సువర్చలకు రూ.56,125,దామెర్ల శంకరరావుకు రూ.2 లక్షల 93 వేల 720,యెర్రమోతు సీతకు రూ.2 లక్షల 42 వేల 993,ఆకుల సామ్రాజ్యంకు రూ.8 లక్షల 33 వేల 154,కేసనశెట్టి బసవరాజ్యంకు రూ.3 లక్షల 7 వేల 550,ఇక్కుర్తి కార్తీక్కు రూ.2 లక్షల 7 వేల



125,మద్దెల కృష్ణకుమారికి రూ.2 లక్షల 81 వేల 409,చదలవాడ మోహన మురళికృష్ణకు రూ.లక్షా 29 వేల 208,ముమ్మలనేని రమేష్బాబు,ముమ్మలనేని ఫణీంద్రబాబులకు రూ.50,105, ముమ్మలనేని వెంకటేశ్వరరావుకు రూ.15,742 ,కె.వి.ఎన్.వి. ప్రసాద్కు రూ.36,317, కె.వెంకటసుధాకర్, కె.వి.ఎస్. వరప్రసాద్లకు రూ.32,822,రామాలయం దేవాలయానికి రూ.85,680,ఆకుల నందకిషోర్కు రూ.78,208,తటవర్తి అరుణకు రూ.80,773,ముమ్మలనేని శ్రీలక్ష్మికి రూ.48,293, ముమ్మలనేని శ్రీనుకు రూ.57,909,సోమిశెట్టి వెంకట కృష్ణారావుకు రూ.67,320,మెండు వెంకటేశ్వరరావుకు రూ.2 లక్షల 74 వేల 238,ఎం.వరప్రసాద్కు రూ.2 లక్షల 92 వేల 394,కస్తూరి హైమావతికి రూ.లక్షా 35 వేల 291,కస్తూరి మహిమా జ్యోతికి రూ.లక్షా 18 వేల 196,లోయ రమ్య స్పందనకు రూ.లక్షా 71 వేల 905,చింతపల్లి సీతామహాలక్ష్మికి రూ.62,996,అల్లంశెట్టి శ్రీనివాసరావుకు రూ.15 లక్షల 99 వేల 269,రావూరి వెంకట శివరామకృష్ణకు రూ.46 వేల 424,పుప్పాల మంగతాయారమ్మకు రూ.లక్షా 97 వేల 061,కంతేటి శ్రీహరికి రూ.2 లక్షల 53 వేల 913,ఎం.శ్రీనివాసరావుకు రూ.23,325,పి.వెంకట నాగలక్ష్మికి రూ.2 లక్షల 72 వేల 824,కె.కోటయ్య, ఉమామహేశ్వర్, లింగమూర్తిలకు రూ.2 లక్షల 67 వేల 440,కె.సోమశేఖర ప్రసాద్కు రూ.లక్షా 21 వేల 406,పి.శ్రీలతకు రూ.64 వేల 974,చుక్కా బద్రయ్యకు రూ.3 లక్షల 59 వేల 680,ఎస్ఎస్ సుఖవేణమ్మకు రూ.లక్షా 28 వేల 045,రావూరి సుధారిణికి రూ.3 లక్షల 10 వేల 318,ఎ.నాగరాజుకు రూ.లక్షా 25 వేల 135,ఆలపాటి భాగ్యలక్ష్మికి రూ.5 లక్షల 19 వేల 570,దేవినేని వెంకటేశ్వరరావుకు రూ.88 వేల 072,టి.ఆమనికి రూ.15 లక్షల 19 వేల 979,బొలిశెట్టి భార్గవికి రూ.3 లక్షల 19 వేల 231,కొమ్మూరి సాయిబాబు,కొమ్మూరి మణికంఠలకు రూ.2 లక్షల 78 వేల 018,నీలవల్లి రాజరాజేశ్వరి దేవికి రూ.6 లక్షల 73 వేల 250,డొక్కు సుబ్బమ్మకు రూ.6 లక్షల 17 వేల 778,పేరంశెట్టి సత్యవతికి రూ.3 లక్షల 90 వేల 734,బి.నాగరాజ్యలక్ష్మికి రూ.4 లక్షల 53 వేల 136,కొమ్మూరి అనూషకు రూ.3 లక్షల 93 వేల 740,మాజేటి సీతమ్మకు రూ.2 లక్షల 52 వేల 457,తాడేపల్లి పురుషోత్తమరావుకు రూ.6 లక్షల 40 వేల 321,జి.ఆర్.సాయిబాబు,జి.శ్రీనివాసరావు,జి.బాల వెంకట భాస్కర్కు రూ.11 లక్షల 79 వేల 142 వంతున నష్ట పరిహారం ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.మున్సిపల్,రహదారుల భవనాల శాఖల ఉన్నతాధికారులు సమన్వయంతో వ్యవహరించి తమ సమస్యను పరిష్కరించాలని లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని భూమి యజమానులు పేర్కొంటున్నారు.

## శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయకమిటీ సమావేశంలో గందరగోళం

**తెనాలి టౌన్,మార్చి1,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలోని బోస్ రోడ్డులో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం పాలకవర్గ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు.గత కొంతకాలంగా పాలకమండలి ఎంపికపై రెండువర్గాల మధ్య వివాదం నడుస్తుండగా, సామరస్యంగా చర్చించేందుకు ఆదివారం సమావేశమయ్యారు. గత 22 సంవత్సరాలుగా





ఎదురుచూస్తున్న పాలకవర్గ ఎన్నికలను గత సంవత్సరం ఏప్రిల్ నెలలో కొత్త కమిటీని ఎన్నుకోవటానికి సమావేశమవగా ఆనాటి పాలకమండలి అధ్యక్షుడు నూకల వేణుగోపాలరావు అస్వస్థత కారణంగా వాయిదా పడింది.ఆరోజు కూడా ఇరువర్గాలు పోటాపోటీగా వాదోపవాదాలతో తీవ్ర ఘర్షణల మధ్య కొనసాగింది దీనిపై కేసులు కూడా నమోదు పెట్టుకోవడం జరిగింది. అప్పటి ఎస్పీ సూచన మేరకు ఇరు వర్గాలకు మధ్యవర్తిగా డబల్ హార్స్ అధినేత మునగాల శ్యామ్ ని మధ్యవర్తిగా నియమించి ఇరువర్గాలు కలిసి చర్చించుకుని ఏకాభిప్రాయానికి వచ్చినాక పాలకవర్గాన్ని ఎన్నుకోండి లేదా కోర్టు తీర్పు వచ్చాక పాలకవర్గాన్ని ఎన్నుకోండి అని ఎస్పీ సూచన మేరకు ఆనాటి సమావేశం వాయిదా పడింది.అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ పెండేల వెంకట్రావు తన మద్దతుదారులతో ఆలయ నూతన పాలకవర్గాన్ని ప్రకటించి ప్రమాణస్వీకారాన్ని నిర్వహించారు.అయితే నేడు ఇరు వర్గాల ఆధ్వర్యంలో నూతన పాలకమండలి ఏర్పాట్ల కోసం ఎన్నికలను నిర్వహించుకోవాలని సమావేశమై తీవ్ర ఉద్రిక్తతలు గందరగోళంల మధ్య కమిటీ పెద్దల సూచన మేరకు ఒక నిర్ణయానికి రావడం జరిగింది. ఈ సమావేశంలో ఇరువర్గాలు వాదోపవాదాలకు దిగి తీవ్ర గందరగోళానికి దారితీసింది. ప్రస్తుత పాలకవర్గం ప్రతిపక్ష వైసిపి పార్టీకి అనుకూలంగా ఉందని ఒక వర్గం ఆరోపిస్తుంటే,మరొక వర్గం అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని ప్రత్యారోపణ చేస్తున్నారు. తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకోవడంతో ఆలయము వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.రెండు వర్గాల మధ్య తీవ్రవాదోపవాదాలు,ఉద్రిక్తతల నడుమ,ఇరు వర్గాలకు అనుకూలంగా ఉండే విధంగా శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కమిటీ పాలకవర్గ ఎన్నికలను ఇరువర్గాల సమక్షంలో కమిటీ పెద్దలు ఏప్రిల్ 26వ తేదీన జరపాలని నిర్ణయించారు. ఇరువర్గాలు ఏప్రిల్ 26వ తేదీన నిర్వహించబోయే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

## విజయవంతంగా స్కిల్ పలావర్ (హ్యాకథాన్)

**తాడేపల్లి,మార్చి 1,ప్రభాతవార్త :** కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని స్కిల్ డెవలప్మెంట్ విభాగం ఆధ్వర్యంలో 2025-26విద్యా సంవత్సరానికి గాను శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు స్కిల్ పలావర్ మూడవ దశ ఫైనల్ స్లాట్ను విజయవంతంగా నిర్వహించారు.స్కిల్ పలావర్ అనేది రెండు సెమిస్టర్ల లో నిర్వహించబడే సమగ్రమైన ప్రాజెక్టు ఆధారిత హ్యాకథాన్



ఫ్రేమ్వర్క్,ఇది లీనమయ్యే అనుభవపూర్వక అభ్యాసం మరియు స్పష్టంగా నిర్వచించబడిన,ఫలిత ఆధారిత సామర్థ్య అభివృద్ధి ద్వారా విద్యార్థుల పరిశ్రమ సంసిద్ధతను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.కెఎల్యు స్కిల్ డెవలప్మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థ యొక్క ప్రధాన భాగంలో వాస్తవ-ప్రపంచ, అప్లికేషన్-ఆధారిత సమస్య పరిష్కారాన్ని సంస్థాగతీకరించడం ద్వారా విద్యా-పరిశ్రమ కలయికను బలోపేతం చేయడంలో స్కిల్ పలావర్ ఒక పరివర్తనాత్మక,వ్యూహాత్మక మైలురాయిని సూచిస్తుందని తెలిపారు.వివిధ విభాగాల నుండి మొత్తం 5,546మంది విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు.కార్యాచరణ ఫ్రేమ్ వర్క్ను కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాజేష్ రూపొందించగా, ఆయా విభాగాధిపతులు నియమించబడిన డొమైన్ స్పోక్లతో దగ్గరి సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నైపుణ్యాభివృద్ధి డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ సమర్థవంతంగా, వ్యూహాత్మకంగా నడిపించారు.కార్యక్రమం వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ,ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్ మార్గదర్శకత్వంలో నిర్వహించ బడిందన్నారు.

## శరీరాన్ని సహజ సిద్దంగా సమతుల్యంగా ఉంచేది ప్రకృతి వైద్యం

**గుంటూరు కల్చరల్,మార్చి 1,ప్రభాతవార్త :** ప్రకృతి వైద్యం అనేది శరీరాన్ని సహజ పరంగా సమతుల్యంగా ఉండేలా చేస్తుంది.వ్యాధి నిరోధక శక్తి పెంపొందిస్తుంది.జీవనశైలి మార్పులను సూచిస్తుంది.అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్యసభలో ప్రముఖ నేచురోపతి జిజిహెచ్ విశ్రాంత వైద్యులుడాక్టర్ పి.ఉమా సుందరి అన్నారు.మానవ శరీరం పంచభూతాలతో నిర్మాణం జరిగింది.ఆ శరీరానికి సమస్య వచ్చినప్పుడు నీరు,గాలి,అగ్ని,భూమి,ఆకాశం అనే ఐదు ఆధారంగా చికత్స జరగాలి దాన్నే ప్రకృతి చికిత్స,ప్రకృత వైద్యం అంటారన్నారు.తొట్టిస్నానం,ఆవిరి స్నానాలు మట్టి చికిత్స వ్యాయామం యోగాసనాలు అనేక వ్యాధులు నయం చేయడం జరుగుతుందన్నారు.మరో ప్రకృతి నిపుణురాలు డాక్టర్ నిరుపమ మాట్లాడుతూ ప్రకృతి వైద్యం అనేది మానవుడు సామరస్యంగా ప్రకృతి యొక్క నిర్మాణాత్మక సూత్రాలతో శారీరక మానసిక,ఆధ్యాత్మిక దశల్లో అతని జీవితంలో రూపొందించుకునే విధానం అన్నారు.సభలో ప్రకృతి వైద్యంపై సభ్యులు లేవనెత్తిన సందేహాలను డాక్టర్ ఉమా సుందరి నివృత్తి చేశారు.సభలో ప్రకృతి వైద్యంపై ప్రజల్లో గత 38సంవత్సరాలుగా విశేషంగా అవగాహన కల్పిస్తూ ప్రస్తుతం త్రిగుణ నేచురోక్యూర్ మరియు యోగా క్లినిక్ ద్వారా నేచురోపతి వైద్యం అందిస్తున్న డాక్టర్ పి.ఉమా సుందరిని అవగాహన సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారుసభలో ప్రకృతి వైద్య నిపుణురాలు డాక్టర్ చంద్రమౌళిక,ఉపాధ్యాయ నేత ఏవి రామారావు,ఆక్యుప్రెషర్ వైద్య విధాన నిపుణులు డాక్టర్ గమనంలు ప్రసంగించారు.కార్యక్రమాన్ని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి సమన్వయం చేశారు.

## నవయుగ సమాజ స్థాపకుడు డాక్టర్ హెడ్గేవార్

**గుంటూరు విద్య, మార్చి 1, ప్రభాతవార్త :** ఏకాత్మ మానవతావాద మాత్రమే దేశాన్ని సంఘటితంగా ఉంచగలరని భావించి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపన ద్వారా భిన్న సంస్కృతులను ఒక గూటికి చేర్చి బలమైన శక్తివంతమైన సమాజ నిర్మాణానికి 100 సంవత్సరాల క్రితం పునాదులు వేసిన డాక్టర్ హెడేవార్ జి దార్శనికత శ్రేయోదాయకమని ప్రముఖ జాతీయవాద జర్నలిస్ట్ కస్తూరి రాకా సుధాకర్ రావు పేర్కొన్నారు.దుర్గాదాస్ గా పేరు గడించిన గోపరాజు వెంకట సుబ్బారావు రచించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నిర్మాత "నవదధీచి మన డాక్టర్ జి (గద్య నాటకం) పుస్తకావిష్కరణ సభ స్థానిక అమరావతి రోడ్డు హిందూ ఫార్మసీ కళాశాల సమావేశ మందిరంలో వందేమాతర గీతం



తో ఘనంగా ప్రారంభించారు.పుస్తకాన్ని సంఘ్ శ్రేయోభిలాషి జూపూడి హైమావతి ఆవిష్కరణ చేయగా ముఖ్య వక్తగా పాల్గొన్న సుధాకర్ రావు మాట్లాడుతూ నిద్రాణిస్తున్న హిందూ సమాజాన్ని మేల్కొల్పి కర్తవ్యాముఖులను గావించేందుకు ఆర్ఎస్ఎస్ ను స్థాపించడంలో కీలక భూమిక పోషించారన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది సంవత్సరములో ఖినవధదీచి మన డాక్టర్ జిఖి నాటకం కూడా శతాబ్ద కాలం పాటు జాతి పునర్జీవాన్ని కొనసాగించేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.పుస్తక రచయిత దుర్గా దాస్ మాట్లాడుతూ భారతమాత ప్రేరేపణతో డాక్టర్ జి జీవితం మీద పుస్తకం రాయటం జరిగిందని చెప్పారు.టీజేపీఎస్ కళాశాల కార్యదర్శి కె.వి బ్రహ్మం అధ్యక్షత వహించగా గుంటూరు విభాగ్ సంఘచాలక్ డాక్టర్ కే.ఎస్.ఎన్ చారి మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం డాక్టర్ జి స్థాపించిన ఆర్ఎస్ఎస్ ప్రపంచ వ్యాప్తంగా వేలాది శాఖలతో లక్షలాదిమంది కార్యకర్తలతో జాతి జీవన రంగాలన్నిటిని పునీతం చేస్తూ గంగా ప్రవాహంలా సాగుతున్నదని తెలియజేశారు. సభకు గడియారం రామకృష్ణ స్వాగతం పలుకుగా కార్యక్రమంలో అంగలకుదురు వాసు దాస స్వామి పీఠాధిపతులు సీతారామస్వామి, డాక్టర్ భోగరాజు విజయభాస్కర్, జూపూడి రంగరాజు, సెర్చ్ ఆర్గనైజేషన్ మన్నవ హనుమ ప్రసాద్, కిషోర్, శ్రీధర్, సాయి కృష్ణ, శ్రీనివాస్ యాదవ్,సంఘ్ ప్రముఖులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## విశేషంగా సంతాన లక్ష్మీ నారాయణుల కళ్యాణం

**గుంటూరు కల్చరల్,మార్చి 1,ప్రభాతవార్త :** స్థానిక అరుండల్పేటలోని శ్రీఅష్టలక్ష్మీ దేవస్థానం వారి 31వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్,వారి బృందం ఆధ్వర్యంలో శ్రీసంతానలక్ష్మీ నారాయణుల కళ్యాణం వేదమంత్రాలతో,మంత్రార్ధలను వివరిస్తూ అర్చక బృందం కళ్యాణాన్ని విశేషంగా నిర్వహించారు.అనంతరం వివిధ రకాల పుష్పాలతో కళ్యాణమూర్తులకు పుష్పాభిషేకం నేత్రపర్వంగా జరిగింది.ఉదయం నిత్యపూజలు,శ్రీచక్రమేరుకు విశేషాభిషేకాలు నిర్వహించారు.ప్రతిరోజూ కార్యక్రమాల్లో తీర్ధ ప్రసాదాల అనంతరం అన్న సంతర్పణ ప్రతిరోజు సుమారు 100మందికి అన్న సంతర్పణ జరుగుతోంది.ఈ సందర్భంగా మర్రిపాటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం కళ్యాణాలు,సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు జరుగుతాయని తెలుపుతూ అందరూ ఆహ్వానితులేనని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని కళ్యాణాల్లో,కుంకుమ పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

## ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులు

**తెనాలి టౌన్,మార్చి1,(ప్రభాతవార్త):** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఈదుముడి పురిటిగడ్డ నాయకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో, ఎంఆర్పిఎస్ గుంటూరు జిల్లా అధ్యక్షులు కిన్నెర నాగరాజు మాదిగ




ఆధ్వర్యంలో, ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఎస్సీ వర్గీకరణపోరులో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు,ఎన్నో ఉద్యమాలు చేసి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా మాదిగ జాతి కోసం ప్రాణాలు పణంగా పెట్టి ఉద్యమాలు చేసిన ఉద్యమవీరులను ఉసురిపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వం మరిచిపోదని,ఈరోజు మనమందరం ఈ సమాజంలో నేను మాదిగ అని గర్వంగా చెప్పుకోగలుగుతున్నాము అంటే కేవలం ఉద్యమంలో ప్రాణాలు సైతం ఫణంగా పెట్టిప్రాణ త్యాగం చేసినటువంటి త్యాగమూర్తులవల్లనేనని, మాదిగ ఉద్యమ వీరులు జోహార్లు అర్పిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో వేమూరు నియోజక వర్గ ఇంచార్జి మోదుకూరు శ్రీను,కారుమూరు సురేష్ మాదిగ,కటివరపు రవి కుమార్ మాదిగ,తెనాలి నగేష్ మాదిగ,ఎల్లమంటి నాని మాదిగ,చిలీ సురేష్ మాదిగ, గద్దం బుజ్జిబాబు మాదిగ, చుండూరు అనిల్ మాదిగ, ఆనంద్ మాదిగ,ఇర్ల నీలయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన కన్నా ఆల్ రౌండ్ టాలెంట్ షో ఎగ్జిబిషన్

**గుంటూరు విద్య, మార్చి 1, ప్రభాతవార్త** స్థానిక ఆర్టీసీ కాలనీ కన్నా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో రెండవ జాతీయ వైజ్ఞానిక దినోత్సవం లో కిమ్స్ శిఖర హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జయ కిషన్ డాక్టర్ మహతి ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ రావు కమర్షియల్ టాక్సెస్ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే చంద్రశేఖర రావు ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ఆశాంతం తిలకించి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.



ఈ సందర్భంగా కిమ్స్ శిఖర హాస్పటల్ డైరెక్టర్ డాక్టర్ జయ కిషన్, ఇగ్నో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ రావు గారు మాట్లాడుతూ గుంటూరు నగరంలో నాలుగున్నర దశాబ్దాల విద్యా చరిత్రలో కన్నా మాస్టర్ వేలాది మందిని విద్యావంతులుగా తీర్చిదిద్ది వారి జీవితాలలో వెలుగులు నింపారని కొనియాడారు

## వైభవంగా శ్రీవిజయలక్ష్మీ నారాయణుల కళ్యాణం

**గుంటూరు కల్చరల్,మార్చి 1,ప్రభాతవార్త :** స్థానిక అరుండల్పేటలోని శ్రీఅష్టలక్ష్మీ దేవస్థానం వారి 31వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్ మరియు వారి బృందం ఆధ్వర్యంలో శ్రీవిజయలక్ష్మీ నారాయణుల కళ్యాణం వేదమంత్రాలతో,మంత్రార్ధలను వివరిస్తూ



అర్చక బృందం కళ్యాణాన్ని విశేషంగా నిర్వహించారు.అనంతరం వివిధ రకాల పుష్పాలు,సుగంధ ద్రవ్యాలతో కళ్యాణమూర్తులకు పుష్పాభిషేకం నేత్రపర్వంగా జరిగింది.ఉదయం నిత్యపూజలు,శ్రీచక్రమేరుకు విశేషాభిషేకాలు నిర్వహించారు. ప్రతరోజు కార్యక్రమాల్లో తీర్థ ప్రసాదాల అనంతరం ప్రతిరోజూ అన్న సంతర్పణ జరుగుతోంది.

## పొగడ్తలు,భజంత్రీల పట్ల నాయకులు అప్రమత్తంగా ఉండాలి

**గుంటూరు కల్చరల్,మార్చి 1,ప్రభాతవార్త :** నీతిమంతుడు,నిజాయితీ పరుడు,మంచితనం ఉన్నవాడు మానవతావాది,కార్యదీక్షా పరుడు,పేదల పెన్నిది,నిస్వార్థ ప్రజాసేవకుడు అంటూ చేయబడుతున్న పొగడ్తలు చాలా వెగటు పుట్టిస్తున్నాయని ఈ విధంగా పొగడ్తల వర్షం కురిపిస్తున్న భజంత్రీల పట్ల నాయకులు అప్రమత్తంగా ఉండాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.తనస్వార్థం తాను చూసుకొని ప్రచారం కోసం దానధర్మాలు చేసేవారిని మంచివాడు,మానవత్వం కలవాడు అని పొగిడేస్తుంటే ఆసభలో పాల్గొన్నవారికి అతని గురించి అంతా తెలిసినవారు ఆశ్చర్యపోతున్నారని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.

## ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**గుంటూరు విద్య, మార్చి 1, ప్రభాతవార్త :** గుంటూరు కంకర గుంట లో ఉన్న సీతారామ సాయి మందిరంలో సీతారాములు షిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అత్యంత ఘనంగా భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించబడింది. నాలుగు రోజులు పాటు సాగిన ఈ మహోత్సవం వేదమంత్రోచ్చారణలు, గణపతి హోమం, సుదర్శన హోమం, ప్రత్యేక యజ్ఞాలు ప్రతిష్టా పూజలతో ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. ఈ ప్రతిష్ట కార్యక్రమాలను బ్రహ్మశ్రీ కూరంచేటి పిచ్చయ్య శాఆధ్వర్యంలో సుమారు 50 మంది పురోహితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ మహోత్సవానికి ప్రముఖ సినీ దర్శకుడు జాగర్లమూడి క్రిష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధికి చేస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. ఆలయ అధ్యక్షులు జాగర్లమూడి సాయిబాబు ప్రోత్సాహంతో సెక్రెటరీ దాసరి శివకుమార్ ఆధ్వర్యంలో మొత్తం కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించబడింది. ట్రెజరర్ చిన్ను శ్రీనివాస్, కమిటీ సభ్యులు గోవిందరాజులు ,సత్యం సింగ్, యోగానంద, శివరాం సింగ్, ఇతర సభ్యులు ఏర్పాట్లలో విశేషంగా కృషి చేశారు. వాలంటీర్లు భక్తులు కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహోత్సవ సందర్భంగా సుమారు 5 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. భక్తులు భక్తి భావంతో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భవిష్యత్తులో మరిన్ని ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సంకల్పం వ్యక్తం చేసింది.

## హాస్పిటల్కు వీల్ చైర్స్, స్ట్రెచర్స్ బహుకరణ

**చీరాల, మార్చి 1, ప్రభాతవార్త :** సాయంకాలం చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏరియా హాస్పిటల్ నందు 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్వీ రాం ప్రసాద్ చేతుల మీదుగా రూ.38వేలు విలువ గల 2 వీల్ చైర్స్, 2 స్ట్రెచర్స్ హాస్పిటల్ డాక్టర్ లక్ష్మీ నారాయణకి అందజేశారు. అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు, కొల్లా సింగారావు, ప్రెసిడెంట్ జాలాది కృష్ణమూర్తి, సెక్రటరీ టి.లక్ష్మీ ప్రతాప్, పోలుదాసు రామకృష్ణ, డాక్టర్ బాబురావు, డాక్టర్ నాగేశ్వరరావు, బి.హేమంత్ కుమార్, రాఘవరావు, సుభాషిణి, ప్రసాద్, శ్రీనివాసరావు, రమేష్, స్వామి, రామారావు, సుభాషిణి, వెంకటేశ్వర్లు, పుల్లయ్య నాయుడు, ఆంజనేయులు, హాస్పిటల్ స్టాఫ్ పాల్గొన్నారు.

